జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

MAM (మెంబర్‌షిప్ అడ్వకేట్స్ మీడియా)
సహకారంతో బహుజన
రాజ్యాధికారం సాధిద్దాం
శివ భాగ్య రావు బహుజన IRS-VRS
నేషనల్ కన్వీనర్
పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి

సంపుటి 15 సంచిక 164 విశాఖపట్నం సోమవారం 13 ఫిబ్రవరి 2023 8 పేజీలు వెల : 5.00

# ఢిల్లీ-ముంబాయి ఎక్స్‌ప్రెస్ వేని ప్రారంభించిన మోడీ



జైపూర్ : ఢిల్లీ-ముంబాయి ఎక్స్‌ప్రెస్‌వే దేశాభివృద్ధిలో బలమైన స్తంభంగా నిలవనుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోను ఈ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా ఢిల్లీ-దౌసా-లాల్‌సోట్‌ల మధ్య పూర్తయిన తొలిదశ రహదారిని ప్రధానిమోడీ ఆదివారం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని దౌసాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతోపాటు రూ.18,100 కోట్లతో చేపట్టనున్న నాలుగు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గన్నారు. తొలిదశలో మొత్తం 247 కిలోమీటర్ల మేర ఈ రహదారిని ఎనిమిది లేన్లుగా రూ.10,400 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీనివల్ల ఇక మీదట మూడున్నర గంట్లలోనే ఢిల్లీ నుంచి జైపూర్‌కు చేరుకోవచ్చు. ప్రస్తుతం 5 గంటల సమయం పడుతోంది. 2019 మార్చి 9న ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఢిల్లీతోపాటు మధ్యలో అయిదు రాష్ట్రాలను (హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర) కలుపుతూ 1386 కిలోమీటర్ల మేర ఈ రహదారి వెళుతోంది. జైపూర్, అజ్‌మేర్, కోటా, ఉదరుపుర్, చిత్తోర్‌గఢ్, భోపాల్, ఇండొర్, ఉజ్జయిని, అహ్మదాబాద్, సూరత్, వడోదరా వంటి ప్రధాన పట్టణాలను కలుపుతుంది. ఈ రహదారి పూర్తిగా సిద్ధమైతే ఢిల్లీ, ముంబాయి మధ్య ప్రస్తుతం ఉన్న దూరం 180 కిలోమీటర్ల మేర తగ్గుతుంది. ప్రయాణ సమయం సైతం 24 గంటల నుంచి ఏకంగా 12 గంటలకు తగ్గిపోతుంది. ఈ రహదారి నిర్మాణం కోసం 5 రాష్ట్రాల్లోని15 వేల హెక్టార్ల భూమిని సమీకరించారు. సుమారు రూ.లక్ష కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది చివరికల్లా ఈ ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిగా అందుబాటులోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

## ఏపి నూతన గవర్నర్‌గా అబ్దుల్ నజీర్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ నియమకమయ్యారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అయిన అబ్దుల్ నజీర్‌ను ఏపీ గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరించందన్‌ను చత్తీస్ గఢ్ గవర్నర్‌గా బదిలీ చేశారు. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన అబ్దుల్ నజీర్ గత నెల జనవరి 4న పదవీ విరమణ చేశారు.

## రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి : జస్టిస్ చంద్రచూడ్



ముంబయి : భారత రాజ్యాంగ పీఠికలో మనకు మనం నిర్దేశించుకున్న 'అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం' లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కోరారు. రాజ్యాంగ లక్ష్యాల సాధన అనేది దేశ పౌరులందరి బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. శనివారం నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. ''అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించాలి'' అంటూ పీఠికలో పేర్కొన్న వాగ్దానాన్ని నెరవేర్చడానికి పౌరులుగా ప్రతి ఒక్కరం పాటు పడాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగమనేది స్వపరిపాలన, గౌరవం, స్వాతంత్ర్యం యొక్క అత్యద్భుతమైన స్వదేశీ ఉత్పత్తిగా ఆయన అభివర్ణించారు. కానీ కొందరు దీనిపై పూర్తిగా ద్వేషపూరితమైన రీతిలో మాట్లాడుతుంటే,

(మిగతా 3లో..)

# ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరిస్తే రిజర్వేషన్లకు విఘాతం

## 'ఉక్కు' పరిరక్షణ దీక్షల్లో వికలాంగులు




విశాఖ కలెక్టరేట్ :'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని, ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించాలని చూస్తే సహించేది లేదని వికలాంగులు నినదించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారానికి 682వ రోజుకు చేరాయి. దీక్షల్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వల్ల రిజర్వేషన్లకు విఘాతం ఏర్పడుతుందన్నారు. వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టిలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ ఎంతో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. అటువంటి కర్మాగారానికి సొంత గనులు కేటాయించాల్సింది పోయి ప్రయివేటుపరం చేసేందుకు కుట్రలు పన్నడం దారుణమన్నారు. ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ.. వికలాంగులను ప్రయివేట్ సంస్థలు అస్సలు పట్టించుకోవని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్, దువ్వాడ సెజ్‌ల్లో ఒక్క వికలాంగ ఉద్యోగీ లేరని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగేంత వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. దీక్షల్లో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య, నాయకులు బడే అప్పలరాజు, సత్తిబాబు, బి.శ్రీనివాస్, మల్లేశ్వరరావు, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీపైనా ప్రయివేటు కత్తి : ద రిపోర్టర్స్ కలెక్టివ్ వెల్లడి




న్యూఢిల్లీ : ఎన్నో కోట్ల కుటుంబాలకు ఆధారమైన 'ప్రజా పంపిణీ వ్యవస్థ' (పిడిఎస్)ను మోడీ సర్కార్ భారంగా భావిస్తోంది. కొత్త బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలపై భారీ ఎత్తున కోతలు పెట్టింది. వ్యయ నియంత్రణలు, ఉచిత ఆహార పథకం పరిధిని కుదించటమే లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోంది. పిడిఎస్‌ను ప్రయివేటుకు అప్పగించాలని, పథకం పరిధిని వీలైనంతగా కుదించాలని 'నీతి ఆయోగ్' ఇచ్చిన నివేదికను అమలుజేయడానికి కేంద్రం సిద్ధమైంది. 'నీతి ఆయోగ్' కేంద్రానికి సమర్పించిన నివేదిక పత్రాల్ని సేకరించిన 'ద రిపోర్టర్స్ కలెక్టీవ్' సంచలన విషయాలు బయటపెట్టింది. ఆహార భద్రత కార్యక్రమాలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుపై 'నీతి ఆయోగ్' వ్యతిరేకత వ్యక్తం చేసిందని (మిగతా 3లో..)

# పార్స్ ఎదుగుదలలో న్యాయవాదుల పాత్ర కీలకం...

### ప్యానల్ న్యాయవాదులను విరివిగా చేర్చాలి.. పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కె.శివభాగ్యరావు






విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి) : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో 'మామ్'( మీడియా అడ్వకేట్స్ మెంబర్షిప్) లో ముఖ్య విభాగమైన న్యాయవాదుల విభాగానికి సంబంధించి పార్స్ ప్యానల్ న్యాయవాదులుగా రాష్ట్రంలో ప్రతి మండలం, నియోజకవర్గం, పార్లమెంట్ పరిధిలోని బహుజన న్యాయవాదులు అందర్నీ గుర్తించి పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరిస్తూ అనుబంధ విభాగమైన న్యాయ విభాగంలో ఎక్కువమంది న్యాయవాదులను చేర్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితిలో న్యాయవాదులు పోషించాల్సిన పాత్ర పై విజయవాడ స్నేహ టీవీ ఆఫీస్ నందు పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కే శివ భాగ్య రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేషనల్ కన్వీనర్ మాట్లాడుతూ రాబోవు కాలంలో రాజ్యాధికారం సాధించే దిశలో భాగంగా పార్స్ ఆశయాలు నచ్చిన వారిని సంతకాల సేకరణలో భాగస్వామ్యం చేయాలని ఆ విధంగా ప్రతి ఒక్కరూ సంతకాల సేకరణలో చురుకుగా పాల్గొని అతి తక్కువ కాలంలో అనుకున్న విధంగా సంతకాల సేకరణ పూర్తి చేయాలి అని విజ్ఞప్తి చేశారు.

(మిగతా 6లో..)

## స్నేహ గ్రూప్ చైర్మన్ కటికల శివ భాగ్య రావు జన్మదిన వేడుకలు..




(వివరాలు 3లో..)

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# కష్టం వస్తే క్షణం ఆగను.. కంటికి రెప్పలా కాపాడుకుంటా..

పర్చూరు, ఫిబ్రవరి 12, ప్రజాపాలన : దుల్హన్ పథకాన్ని నిలిపివేసి, ముస్లిం మైనార్టీలను మోసం చేసిన ఘనత జగన్ రెడ్డి దేనని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు విమర్శించారు. ఇంకొల్లు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాబర్ భాష ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సభకు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముస్లిం మైనారిటీల వివాహాల కోసం, టిడిపి ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు 50,000 ఇస్తే, జగన్ రెడ్డి రూపాయి కూడా ఇవ్వట్లేదన్నారు. ఎన్నికల సమయంలో దుల్హన్ పథకానికి, లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి, పూర్తిగా నిలిపివేసి, ముస్లిం సోదరులను,ఆర్థిక ఇబ్బందులకు, గురి చేస్తున్నాడని మండిపడ్డారు. వాహన మిత్ర పేరుతో డబ్బులు ఇస్తూ,మరో పక్క అధికారులతో చలానాల పేరుతో, ఇచ్చిన



సొమ్మును లాగేసుకుంటున్నారన్నారు. ముస్లిం మైనారిటీలకు, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక రంగాలలో, అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు దేనన్నారు. ముస్లిం సోదరుల చిరకాల వాంఛ హాజ్ యాత్ర కు, తెలుగుదేశం ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలకు, రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ముస్లిం సోదరులపై, అనునిత్యం దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడుతున్నా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. బెదిరింపులతో, ప్రజల హక్కులను కాలరాస్తూ, రాజకీయంగా లొంగదీసుకునేందుకు, వైసిపి నేతలు ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, సొంత ఇంటికి రెంట్ చెల్లించాల్సిన పరిస్థితులు, తలెత్తే అవకాశం ఉందని ఆరోపించారు. రోడ్డుపై తిరగాలంటే, పన్నులు కట్టాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అభివృద్ధిని విస్మరించి, అరాచకాలు, దాడులు తప్ప, సాధించిన ప్రగతి ఏమి లేదన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ, అక్రమ సంపాదన యే ధ్యేయంగా, వైసీపీ నేతలు పనిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో చివరికి తోపుడుబండ్లపై, పండ్లు అమ్ముకునే పేదలను సైతం, వీల్చివిప్పి చేస్తున్నారని, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు.తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ పాదయాత్రలో, పోలీసులు స్పీకర్లు పట్టుకెళ్తూ, చిన్నపిల్లల చేష్టలు చేస్తున్నారని, పాదయాత్రకు వస్తున్న జన స్పందన చూసి, ప్రభుత్వంలో వణుకుమొదలైందన్నారు.జగన్ ను ప్రశ్నించే గొంతులను, నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఇంకొల్లు ఆటోనగర్ నిర్మాణ బాధ్యత, తాను తీసుకుంటానన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, దానిని పూర్తి చేసిన ఘనత తనదేనన్నారు. ముస్లిం సోదరులందరికీ అండగా ఉంటానని,వారికి ఏ కష్టం వచ్చినా,క్షణాల్లో వస్తానన్నారు. ముస్లిం సోదరులు అందరినీ, కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదేనన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, చిన్నగంజాం మండల ప్రధాన కార్యదర్శి ఆజాద్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి ఖాసిం, మాజీ జెడ్పిటిసి సభ్యులు వీరగంధం ఆంజనేయులు, మీరా వలి, మస్తాన్, రబ్బాని, షేక్ మీరావలి గౌస్, చెన్నై మీరావలి, మహమ్మద్ అలీ,సమీర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక**

ఇంకొల్లుకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బషీర్, సైదా, ఖాజా ,మగ్బుల్, సాహెబ్, గఫార్ ,హేపీ, బాసి, భాగ్య రావు, మధు, కమలాకర్, తదితరులు ఉన్నారు.

## ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. షార్ట్ ఫిలిం కాంటెస్ట్-2023

**ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహిద్దాం - బాలీవుడ్ నటీమణులు అంకితా బ్రహ్మ, యుక్తా రక్షిత్**



మంగళగిరి,ప్రజాపాలన ప్రతినిధి : ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించడంతో పాటు వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మధు ఫిలిం స్టూడియోస్, మా ఏపి ఆధ్వర్యంలో షార్ట్ ఫిలిం కాంటెస్ట్-2023 పోటీలు నిర్వహించడం ముదావహమని ప్రముఖ దర్శకులు కస్తూరి శ్రీనివాస్, ఎం.వి.రఘు, సంగీత దర్శకులు సాకేత్ సాయిరాం అన్నారు. మంగళగిరి ఆత్మకూరులోని హ్యాపీ రిసార్ట్స్‌లో ఆదివారంనాడు జరిగిన షార్ట్ ఫిలిం కాంటెస్ట్-2023 కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం బాలీవుడ్ నటీమణులు అంకితా బ్రహ్మ, యుక్తా రక్షిత్‌లు పాల్గొని మాట్లాడుతూ, సినిమా పరిశ్రమ అంటే ఒక యూనిటీ అని ప్రపంచ దేశాలు మన భారతీయత సాంకేతిక పరిజానంతో కూడిన చిత్రాలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎంపిక కాని వారంతా కూడా నిరాశ చెందకుండా భవిష్యత్తులో మంచి కాన్సెప్ట్, క్రియేటీవిటి ఉన్న చిత్రాలను నిర్మించాలని కోరారు. మొదటి బెస్ట్ షార్ట్ ఫిలిం గా ఐ వాంట్ హాలిడే, రెండో బెస్ట్ షార్ట్ ఫిలిం గా హగ్, మూడో బెస్ట్ ఫిలిం గా మా నాన్న ఆల్కహాలిక్ నిలిచాయి. బెస్ట్ డైరెక్టర్ - ఐ వాంట్ హాలిడే, బెస్ట్ మ్యూజిక్ - హగ్, బెస్ట్ డి ఓ పి - స్వేచ్ఛ, బెస్ట్ యాక్టర్ - రామ స్వామి (పశువు), బెస్ట్ యాక్ట్రెస్ - స్రవంతి (పశువు), స్పెషల్ అప్రీసియేషన్ అవార్డు ఫర్ చైల్డ్ ఆర్టిస్ట్ - పీ. సాయి హర్శ్విన్ (చైల్డ్ బెగ్గర్) కు లభించాయి. ఈ సందర్భంగా విజేతలకు గౌరవ అతిథులుగా విచ్చేసి బాలీవుడ్ నటీమణులు అంకితా బ్రహ్మ, యుక్తా రక్షిత్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఐపీఎస్ కుమార్తె ఐపీఎస్.. పాసింగ్ ఔట్ పరేడ్‌లో బిడ్డకు సెల్యూట్ చేసిన అసోం డీజీపీ

గువాహటి: అసోం డీజీపీ గ్యానేంద్ర ప్రతాప్ సింగ్ హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న తన కుమార్తె ఐశ్వర్యా సింగ్‌కు సెల్యూట్ చేశాడు. శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారుల పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఈ అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. ఆ ఉద్విగ్న క్షణాలకు సంబంధించిన వీడియోను అసోం డీజీపీ శనివారం తన ట్విటర్ హ్యాండిల్‌లో పోస్టు చేశాడు.ఆ వీడియోలో తండ్రికి కుమార్తె, కుమార్తెకు తండ్రి సెల్యూట్ చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ నవ్వుతూ ఫొటోలకు ఫోజిచ్చారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తండ్రి, కుమార్తెలను మెచ్చుకుంటూ నెటిజన్‌లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒక ఐపీఎస్ అధికారి తన కుమార్తెను కూడా ఐపీఎస్ అధికారిణిని చేయగలగడం చాలా గొప్ప విషయమని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. కాగా, సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన గ్యానేంద్ర ప్రతాప్ సింగ్ ఈ నెల 1న అసోం డీజీపీగా నియమితులయ్యారు. తన లాగే తన కుమార్తె కూడా ఐపీఎస్ అధికారి కావడంపై ఆయన మాట్లాడుతూ.. చాలా గర్వంగా ఉందన్నారు. తన లాగే తన కుమార్తె కూడా పోలీస్ డిపార్టుమెంటులో అంచెలంచెలుగా ఎదగాలనీ ఆయన ఆకాంక్షించారు. తన కుమార్తె పాసింగ్ ఔట్ పరేడ్ సందర్భంగా ఆనందంతో తనకు నోటమాట రాలేదని చెప్పారు.

## మాచవరంలో 14 కోట్ల రూపాయలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాము: నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి




పల్నాడు జిల్లా .నరసరావుపేట ఫిబ్రవరి 12. (ప్రజాపాలన ప్రతినిధి.): గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. రొంపిచర్ల మండలంలోని మాచవరం గ్రామంలో ఆదివారం 40 లక్షలతో నిర్మించిన సచివాలయం ,20 లక్షలతో నిర్మించిన వైయస్సార్ విలేజ్ క్లినిక్,కేంద్రాలను పెదకూరపాడు నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు నంబూరు శంకర్ రావు, స్థానిక డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు.ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టిన గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమునకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని అన్నారు. మాచవరం గ్రామంలో ఇప్పటి వరకు 14 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయటం జరిగిందని అన్నారు. గ్రామంలో 2.29 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేసామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గ్రామంలో వైసిపికి 800 ఓట్ల మెజార్టీ వచ్చిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి గతం కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి గ్రామంలో విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించటం జరుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి జగన్ గ్రామాలలో అర్హులైన లబ్దిదారులకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తూ విజయవంతంగా పాలన చేస్తున్నారని అన్నారు.పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారని అన్నారు.అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అమలు జేస్తున్న ఈ ప్రభుత్వానికి, గత ప్రభుత్వమునకు తేడా ప్రజలు గమనించాలని అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గ్రామంలో వైసిపికి 800 మెజారిటీ రావడం అభినందనీయమని అన్నారు.వచ్చే ఎన్నికల్లో వైసిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గుండాల వెంకటేష్, మానుకొండ వాసుదేవరెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ నాయకులు, పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 14 నాటికి రహదారులు పూర్తికావాలి అధికారులను ఆదేశించారు: కోటప్పకొండలో తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పల్నాడు జిల్లా .నరసరావుపేట .ఫిబ్రవరి 12 (ప్రజా పాలన ప్రతినిధి.): కోటప్పకొండకు వచ్చే అన్ని రహదారులు



ఈనెల 14వ తేదీకి సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. మహాశివ రాత్రిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన నిర్వ హించే తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కోటప్పకొండలో పర్యటించారు. ప్రధానంగా రహదారులను ఆయన పరిశీలించారు. కొండకు వచ్చే ప్రధాన రహదారు లతో పాటు లింక్ రోడ్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. యల్లమంద వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోటప్పకొండ-పమిడిమర్రు- జెఎన్టీయు కళాశాల మీదగా వినుకొండ రోడ్డు వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నరసరా వుపేట నుంచి యల్లమంద మీదగా కోటప్పకొండ రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభలు కట్టే వాళ్ళు ఎవరూ భయపడొద్దు, కావాలంటే వాళ్ళందరూ రోడ్లను పరిశీలించాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈనెల 14వ తేదీన మూడో రివ్యూ మీటింగ్ లో కోటప్పకొండ స్పందించిన అన్ని పనులు పూర్తయితే అన్నారు .ఆరోజు జిల్లా కలెక్టర్, ఎస్పీ, మందిత అధికారులతో అన్ని పనులను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంల %=ఉదీ ఐజు% రాజు నాయక్, రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్సై బాలనాగిరెడ్డి, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామికి పూజలు



గోకవరం, ప్రజా పాలన ప్రతినిధి ఫిబ్రవరి 12: ఊర కాలువ సమీపంలో బొప్పన వీర రాఘవ నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఆరవ వార్షిక ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామికి హెూమాలు జరిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు పండితులు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

## గడపగడప కార్యక్రమము ద్వారా డ్రైనేజీ పనులు వేగవంతం చేస్తున్నా ఎంపీపీ



గోకవరం, ప్రజా పలన ప్రతినిధి: గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం లో ప్రతి సచివాలయాం పరిధిలో డ్రైనేజీలు వేయడానికి నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగానే ఊర కాలువ సమీపంలో నాలుగు లక్షలతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో ఆదివారం కొబ్బరికాయ కొట్టి ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ప్రతిరోజు లేచి లేవగానే ప్రజల్లోకి వెళుతూ.. తమ అవసరాలు తీరుస్తూ ప్రజలకు చేరువవుతున్నారు. ప్రతిరోజు పలు గ్రామాలలో పర్యటిస్తూ.. అక్కడున్న సమస్యలను ఎమ్మెల్యే చంటిబాబుకు వివరిస్తున్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఎంపీపీకి సూచనలు సలహాలు ఇవ్వడంతో. అభివృద్ధి పనుల్లో ముందుకు సాగుతున్నారు ఇప్పటికే మండలంలో చాలాచోట్ల డ్రైనేజీలు సిసి రోడ్లు వేయించిన ఘనత ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబుకి దక్కుతోందని పలువురు అన్నారు ఇప్పటివరకు ఎవరు చేయించాలని అభివృద్ధి పనులను. చేస్తున్నారు. మరికొన్ని సచివాలయ పరిధిలో ఉన్న వీధులను కూడా త్వరలోనే డ్రైనేజీలు సిసి రోడ్లు వేయిస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు . తెలిపారు

## జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదుపై సమీక్ష సమావేశం.



గోకవరం ప్రజాపాలన ప్రతినిధి ఫిబ్రవరి 12: జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని జనసైనికులు అందరూ సమిష్టిగా విజయవంతం చేయాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ఆదివారం నాడు గోకవరం సూర్య ఫంక్షన్ హాల్ నందు జనసేనకులతో కలిసి జనసేన క్రియాశీలక సభ్యత్వాలపై సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసైనికులు కుటుంబాలకు ఎటువంటి ఆపద వచ్చిన వారికి మేమున్నామంటూ భరోసా కల్పించేందుకే ఈ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు కార్యక్రమం పవన్ కళ్యాణ్ చేపట్టడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు ఈ ప్రపంచంలోనే ఏ పార్టీ కూడా ఆలోచించని విధంగా జనసేనాని ఆలోచనలు ఉన్నాయని, అందుకు నిదర్శనమే ఈ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం అని ఆయన అన్నారు. గతంలో కంటే రెండింతలు క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడం లక్ష్యంగా పెట్టుకుని జనసైనికులు అందరూ సమిష్టిగా క్రియాశీలక సభ్యత్వాలు అత్యధికంగా జగ్గంపేట నియోజకవర్గం నుండి పవన్ కళ్యాణ్ కు బహుమతిగా అందజేద్దామని ఈ సందర్భంగా సూర్యచంద్ర తెలిపారు.. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గోకవరం గ్రామ కమిటీ అధ్యక్షులు పదిలం మురళి, గోకవరం మండలం మీడియా విభాగం అధ్యక్షులు మహిపాల పాండురాజు, ఎస్సీ సెల్ టౌన్ కన్వీనర్ నరేంద్ర తదితర జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు..

## గుజరాత్‌లో దారుణం.. దగ్గు తగ్గట్లేదని రెండు నెలల బాలికకు ఒంటిపై వాతలు..!

పోరుబందర్: గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందర్ జిల్లాలో దారుణం జరిగింది. దగ్గు తగ్గడంలేదని ఓ రెండు నెలల చిన్నారి ఒంటిపై కాల్చిన ఇనుప రాడ్‌తో వాతలు పెట్టారు. దాంతో బాలిక పరిస్థితి మరింత క్షీణించి ఆస్పత్రి పాలైంది. ఆస్పత్రిలో బాలిక ఒంటిపై వాతలు గమనించిన వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు బాలికకు వాతలు పెట్టిన నాటు వైద్యుడితోపాటు, ఆ నాటు వైద్యుడి దగ్గరికి బాలికను తీసుకెళ్లిన తల్లిని కూడా అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. పోరుబందర్ జిల్లాలోని ఓ గ్రామంలో రెండు నెలల బాలికకు దగ్గులేసింది. దాంతో చిన్నారి తల్లిదండ్రులు స్థానిక క్లినిక్‌లో చూపించారు. అయినా తగ్గకపోవడంతో చిన్నారి తల్లి స్థానికంగా ఉండే ఓ నాటు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లింది. బాలికను పరీక్షించిన నాటు వైద్యుడు ఓ ఇనుప చువ్వను కాల్చి బాలిక ఛాతీపైన, పొట్టపైన వాతలు పెట్టాడు.అయినా దగ్గు తగ్గకపోగా వాతల తాలూకూ నొప్పితో చిన్నారి నరకయాతన అనుభవించింది.

## వంద శాతం ఉత్తీర్ణతయే లక్ష్యం..: జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారికతా అధికారిణి జె.రాజడెబోరా



చీరాల, ఫిబ్రవరి 12, ప్రజాపాలన : సంక్షేమ హాస్టళ్లలో, పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత తో పాటు, మంచి మార్కులు సాధించా లని,జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ మరియు సాధికారికతా అధికారిణి జె.రాజ డెబోరా అన్నారు. ఆదివారం ఉదయం, చీరాల పరిసర ప్రాంత, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కి, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం లో, ప్రేరణా తరగతులు నిర్వ హించారు.పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి, వందశాతం ఉత్తీర్ణత సాధించా లని, పదో తరగతి విద్యార్థు లకు, జరుగుతున్న ప్రేరణా తరగతుల సందర్భంగా, విద్యార్థులు కష్టపడి చదివి, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.వచ్చే ఏప్రిల్ నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో, జిల్లాలో వారికి ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో, పదోతరగతి చదువుతున్న విద్యార్థుల్లో, శారీరక మానసిక ఉత్తేజాన్ని పెంపొందించి, విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించేలా, చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, వంద శాతం ఉత్తీర్ణతతో పాటు, మంచి మార్కులు సాధించా లని సూచించారు. కార్యక్రమం లో సహాయ సంక్షేమ అధికారిణి యువ స్వరూప, రిసోర్స్ పర్సన్లు పవని భాను చంద్ర మూర్తి, ఎల్.శ్రీను, శివ ప్రసాద్, శ్రీనివాసరావు, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## అధికారభాషా సంఘం రాష్ట్ర కమిటీలో డా.తవ్వా వెంకటయ్య

**మహాబోధి అభినందనలు**



ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చే, అధికార భాషా సంఘంలో రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులను నియమించడం జరిగింది. అందులో డా. తవ్వా వెంకటయ్యగారు, కత్తి వెంకటేశ్వర్లు, డి. మస్తానమ్మ లను రాష్ట్ర కమిటీ సభ్యులు గా నియమించారు.ఇందులో, మా ఆత్మీయ సోదరుడు, గొప్ప సీమ కథకులు, కరువు సీమలో సాహిత్యకృషీవలుడు తవ్వా వెంకటయ్య వై.యస్.ఆర్ కడప జిల్లా దగ్గర అతి సాధారణ కుటుంబంలో జన్మించి, స్వయం కృషితో ఉన్నత చదువులు చదువుకుని, ఉపాధ్యాయుడుగా చిరు ఉద్యోగం చేస్తు, విదేశీ తెలుగు పిల్లలకు ఆన్ లైన్ ద్వారా తెలుగు పాఠాలు బోధిస్తూన్నారు డా.తవ్వా వేంకటయ్య గారిని ఈ పదవి వరించడం గొప్ప స్ఫూర్తి దాయకం.ఈ సందర్భంగా డా. తవ్వా వెంకటయ్య గారికి, మిగతా కమిటీ సభ్యులకు మహాబోధి సాహిత్య వేదిక తరపున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాము. వీరి నియామకానికి తోడ్పాటు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, అధికారులకు ధన్యవాదములు.ఈ సందర్భంగా డా. వెంకటయ్య ఒక మాతృభాషా వేత్తగా తెలుగును ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తప్పనిసరిగా బోధించే విదంగాను , అన్ని పరిపాలనా విభాగాల్లో పాలన తెలుగులో అమలయ్యే విదంగా కృషి చేయాలని కోరుతూంది .ఇక డా. తవ్వా వెంకటయ్య గారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని మహాబోధి సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాసన్నగారి కృష్ణమూర్తి ఆకాంక్షిస్తున్నారు.



బెంగుళూరు లో బోధన హొసహల్లి లోని లక్ష్య బిల్డింగ్ లో స్నేహ క్లబ్ కార్యాలయంలో స్నేహ క్లబ్ డైరీ లను ఆవిష్కరించిన కర్ణాటక రాష్ట్ర స్నేహ క్లబ్ అధ్యక్షుడు ఎం.లఘుమయ్య, స్నేహ క్లబ్ డైరెక్టర్‌లు, సిబ్బంది.

# పార్స్ ఎదుగుదలలో న్యాయవాదుల పాత్ర కీలకం...

(మొదటి పేజీ తరువాయి)



సంతకాల సేకరించే విధానంలో భాగంగా పార్స్ ముఖ్య ఆశయాలను బహుజనులకు బడుగు బలహీన వర్గాల ప్రజలకు, అభ్యుదయ వాదులకు వివరంగా తెలియపరుస్తూ అధికారం బీసీ ముఖ్యమంత్రి, కులాంతర వివాహం చేసుకున్న వారికి సమతా కులం అనే నామకరణం , ఎవరెంతో వారికంత వాటా అభివృద్ధిలో ఎవరి భాగం వారిది సమాజంలో మహిళలకు సగభాగం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన విధంగా ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటు , ఇలాంటి అనేక విషయాలను తెలియపరుస్తూ సంతకాలను సేకరించాలని చెప్పారు. అంతేకాక స్వతంత్రం వచ్చిన నాటి నుండి ప్రభుత్వాలు అనేక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని వృధా చేయడమే కాక కమిటీలు ఇచ్చిన సలహాలను పాటించకుండా కాలయాపన కమిటీలుగా మార్చారని, బడ్జెట్లో కేటాయించిన విధంగా అమలు చేయకుండా ఆ బడ్జెట్లో కేటాయించినటువంటి నిధులను పక్కదారులు



మళ్లిస్తూ పాలకులు ఏవిధంగానూ బహుజనగా అట్టడుగు వర్గాలకు న్యాయం చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ రాజ్యాధికార సమితి సి డబ్ల్యూ సి లీగల్, పార్స్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఎం రామదాసు, రిటైర్డ్ జిల్లా జడ్జి బి వినయ్ కుమార్,పార్స్ స్టేట్ అడ్వకేట్స్ ఇంచార్జ్ వై న్యూటన్, కుసుమ భోగరాజు సోషల్ యాక్టివిస్ట్ , విజయవాడ పార్స్ ఆఫీస్ దాత దాసరి కేశవులు, స్టేట్ కోఆర్డినేటర్ నమ్మి అప్పారావు యాదవ్, స్టేట్ కోఆర్డినేటర్ కటికల రవికుమార్ , స్టేట్ కోఆర్డినేటర్ అడ్వకేట్ డి కే వి ప్రకాష్, డాక్టర్ కందుల చందు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సి డబ్ల్యూ సి మెంబర్, అడ్వకేట్ ఆర్ బాలు, అడ్వకేట్ జయ ప్రకాష్ , అడ్వకేట్ సాంబిరెడ్డి, పీవీవీ సత్యనారాయణ హై కోర్ట్ అడ్వకేట్, ఏ ప్రవీణ్ కుమార్ అడ్వకేట్ బి బి ఏ, వేముల ప్రసాద్ హై కోర్టు అడ్వకేట్, అడ్వకేట్ వి నాగరాజు ఏ పి హెచ్ సి%ఉ% ఆల్ డిస్టిక్ కోర్ట్స్, ఏపీ పార్స్ ట్రెజరర్ మరియు ఏపీ స్టేట్ మాస్టర్ కి టీవీ ఛానల్ ఇన్చార్జి గురజాల శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి : జస్టిస్ చంద్రచూడ్

(మొదటి పేజీ తరువాయి)

చాలామంది భారత రాజ్యాంగం సాధించిన విజయం గురించి విరక్తిగా మాట్లాడతారని అన్నారు. కానీ ఈ రెండింట్లోనూ వాస్తవికత లేదని అన్నారు. భారతదేశ వలసవాద నాయకులు మనపై రాజ్యాంగాన్ని రుద్దలేదను విషయాన్ని గుర్తు చేశారు. మన రాజ్యాంగమనేది ఎలా ఆవిర్భవించిందో ఆ కోణంలో నుండి చూసినట్లైతే, అదొక అత్యద్భుతమైన అంశంగా గుర్తిస్తారని ఆయన స్పష్టం చేశారు. చేయాల్సిన పనులు ఇంకా చాలా వునుప్పటికీ రాజ్యాంగం చేసిన పనులు, కృషి కూడా చాలా వుందని అన్నారు. యువ న్యాయ విద్యార్థులు, న్యాయ పట్టభద్రులు రాజ్యాంగ విలువల మార్గదర్శకత్వంతో వృత్తి జీవితంలో ముందుకు సాగినట్లైతే వారెనుటికీ విఫలమవరని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పీఠిక గురించి ప్రస్తావిస్తూ, చినుదిగానే వున్నా రాజ్యాంగానికి ఇది బరువును చేకూర్చిందన్నారు. భారత ప్రజలుగా మనం ఈ రాజ్యాంగానికి కట్టుబడి వుండాలనిఆకాంక్షించారు. ఈనాడు అత్యంత సులభంగా మనం అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులు, సౌకర్యాలకుగానూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు మన భారతీయులందరం రుణపడి వున్నామన్నారు.

## ప్రజా పంపిణీపైనా ప్రయివేటు కత్తి : ద రిపోర్టర్స్ కలెక్టివ్ వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

ఈ పత్రాల్లో స్పష్టంగా ఉంది. ఆహార సబ్సిడీ పథకాలకు మంగళం పాడాలని కేంద్రానికి సూచించింది. ఈ నివేదికలోని అంశాల ఆధారంగా సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. 2021 జనాభాకు అనుగుణంగా పిడిఎస్ పథకాన్ని విస్తరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ కొత్త బడ్జెట్‌లో కేంద్రం ఆహార సబ్సిడీలో పెద్ద ఎత్తున నిధులకు కోతలు విధించింది. ఇదంతా కూడా నిటి ఆయోగ్ సూచనలు, సిఫారసుల ప్రకారం జరిగిందని ప్రభుత్వ పత్రాలు చెబుతున్నాయి. కొత్త బడ్జెట్‌లో కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఆహార సబ్సిడీలో రూ.1.79,844 కోట్లమేర కోతలు విధించడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందని సమాచారం. ఆహార ధాన్యాల సేకరణ ప్రయివేటు, కార్పొరేట్ రంగాలకు అప్పగించాలని నీతి ఆయోగ్ సూచించింది. ప్రజా పంపిణీ పథకాల్లోనూ వాటి భాగస్వామ్యం తీసుకురావాలని కేంద్రానికి తెలిపింది. ఈమేరకు కేంద్రం తగిన కార్యచరణ చేపడుతోందని, 'నీతి ఆయోగ్' సూచనల మేరకు బడ్జెట్ గణాంకాలు వెలువడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## మోదీ స్పీచ్‌లో ఏముంది.. అబద్ధాలు తప్ప: మాజీ సీఎం

అగర్తలా: త్రిపురలో జరిగిన రెండు ఎన్నికల ర్యాలీలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలపై ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత మానిక్ సర్కార్ ఘాటుగా స్పందించారు. అన్నీ అవాస్తవాలు, అబద్ధాల ప్రాతిపదికగానే ప్రధాని ప్రసంగం సాగిందని, రాష్ట్రంలో బీజేపీ అవకతవకల పాలనను కప్పిపుచ్చుకునేందుకే ఆయన ప్రయత్నించారని అన్నారు. అబద్ధాల ప్రాతపదికగా ప్రకటనలు చేయడం మంచిది కాదని, ప్రజలను తప్పుదారి పట్టించరాదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు కూడా అయిన మానిక్ సర్కార్ హితవు పలికారు. త్రిపురకు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు (1998-2018) అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌ను కలిసి బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా చెప్పానని, ఆ తర్వాత 2013-14లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా పలుసార్లు సమావేశమయ్యానని ఆయన చెప్పారు. వాస్తవం ఇలా ఉంటే 2018లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగుదేశానికి విద్యుత్ సరఫరా చేశామని మోదీ చెప్పుకుంటున్నారని అన్నారు. దశాబ్దాల తిరుగుబాట్లకు లెఫ్ట్ ఫ్రంట్ హయాంలో కళ్లెం వేశామని, సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం-1958ని 2015 మే 27న ఉపసంహరించుకున్నామని తెలిపారు. మోదీ ఒకపర్యాయం ముఖ్యమంత్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో త్రిపురలో ఏవిధంగా తిరుగుబాట్లకు కళ్లెం వేశారంటూ తనను అడిగారని తెలిపారు. మోదీ విజ్ఞప్తి మేరకు అందుకు సంబంధించిన సమగ్ర నివేదకను కూడా ఆయనకు తాను అందజేశానని మానిక్ సర్కార్ చెప్పారు."త్రిపురలో తిరుగుబాట్లకు ఒక మంత్రితో సహా పార్టీకి చెందిన 350 మందికి పైగా కార్యకర్తలు, మద్దతుదారులు, లెఫ్ట్ కార్యకర్తలు, వర్కర్లు ప్రాణాలు కోల్పోయారు. మిలిటెన్సీని అణిచివేయడానికి లెఫ్ట్ ప్రభుత్వం ఎంత కష్టపడిందో యావద్దేశానికి తెలుసు. మోదీ మాత్రం లెఫ్ట్ హయాంలో శాంతి లేకుండా పోయిందని చెబుతున్నారు" అని మానిక్ సర్కార్ తప్పుపట్టారు. లెఫ్ట్ హయాంలో త్రిపురలో ప్రజాస్వామ్యం అనేదే లేదని ప్రధాని చెప్పినది నిజమైతే.. 2018లో లెఫ్ట్ అధికారంలో ఉన్న రాష్ట్రం బీజేపీ చేతుల్లోకి ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జంగిల్ రాజ్ మొదలైందని, అడవుల్లో అయినా కొంత క్రమశిక్షణ ఉంటుందేమో కానీ కాషాయం పార్టీ పాలనలో త్రిపురలో చట్టబద్ధమైన పాలన కాగడా వేసినా కనిపించదన్నారు.కాంగ్రెస్, లెఫ్ట్ సీట్ల సర్దుబాటు ఒప్పదంపై ప్రధాన మంత్రి చేసిన ఆరోపణలను మానిక్ సర్కార్ తిప్పికొట్టారు. త్రిపురలో బీజేపీని ఓడించి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, చట్టపాలన కోసం కాంగ్రెస్, లెఫ్ట్ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. మోదీకి ఓటమి భయం పట్టుకుందని, ఆ భయమే ఆయన ప్రసంగాల్లో కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ 299 వాగ్దానాలు చేసిందని, కానీ ఎందుకు వాటిని నిలబెట్టుకోలేదో మాత్రం మోదీ తన ప్రసంగంలో చెప్పలేదని అన్నారు. 2018 తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ అధికార పార్టీ దుండగులు రిగ్గింగ్ చేశారని, ఎన్నికలనేవి ఒక ఫార్స్‌లా మారాయని అన్నారు. విపక్ష పార్టీల రాజ్యాంగ హక్కులను కూడా బీజేపీ ప్రభుత్వం అణిచివేసి, వందలాది పార్టీ కార్యాలయాలను పట్టపగలే కూల్చేయడం, అగ్నికి ఆహుతి చేయడం చేసిందని మాజీ సీఎం ఆరోపించారు. ప్రధాన మంత్రి ప్రజలకు ఏమి చెప్పి ఒప్పించాలని ప్రయత్నించినా ఫిబ్రవరి 16న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని ఆయన తెలిపారు.


PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

| | | | |
|---|---|---|---|
| Hyderabad | 76600 27682, 7842106355 | Tirupathi | 94400 77239 |
| Visakhapatnam | 0891-2791205, 9246663046 | Bapatla | 94403 20562 |
| | 7660027696, 7660027664 | Ponnur | 99089 91763 |
| | | Cherukupalli | 79958 56068 |
| Vijayawada | 76600 27670, 900062111 | Karlapalem | 76600 27676 |

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన


## సంపాదకీయం

సోమవారం 13, ఫిబ్రవరి 2023

### కుల రక్కసి కరాళ నృత్యం అంతం చేద్దాం !

కర్నూలు మండలం దేవమడ గ్రామంలోనూ ఇంకా కొన్ని చుట్టుపక్కల గ్రామాల్లోనూ గ్రామ వాలంటీర్లు దళితుల ఇళ్లకు వెళ్ళరు. వాళ్ళనే తమ ఇళ్ళకు పిలిపించుకుంటారు. ఊళ్ళోని ప్రతి ఇల్లూ తిరగడమన్నది గ్రామ వాలంటీర్ల ఉద్యోగ ధర్మం. దాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం ఎంత తప్పు? అయితే వారిని అడిగేవారు లేరు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇంతటి వివక్ష కొనసాగుతూ ఉందంటే... మనుషులుగా మనమంతా తల వంచుకోవాలి. అన్ని వర్గాల వారికి సమ న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వోద్యోగులు, పాలకులు సిగ్గుపడాలి ! నేను విప్లవకారుణ్ణి. అన్ని దేశాలూ నావే. నిజమైన విప్లవ కారుడు ఓ అద్భుతమైన ప్రేమికుడై ఉంటాడని నేను చెప్తే మీకు కాస్త ఆశ్చర్యంగానే ఉండొచ్చు. కానీ, ప్రేమించే గుణాన్ని కోల్పోయిన వాడు ఎన్నటికీ గొప్ప విప్లవకారుడు కాలేడు. ప్రపంచంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా మనం గాఢంగా ప్రతిస్పందించడం చాలా అవసరం. ప్రతి వారికీ ఉండి తీరాల్సిన అద్భుతమైన లక్షణం అదే! – చే గువేరాకర్నూలు జిల్లాలో కులరక్కసి కరాళ నృత్యం చేస్తోంది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో ఒళ్ళు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయి. సుమారు ఎనభై తొమ్మిది గ్రామాల్లో పదిహేను రకాల కులవివక్షలు కనిపించాయి. అరవై నాలుగు గ్రామాల్లో దళితులకు దేవాలయ ప్రవేశంలేదు. ముప్పయి గ్రామాల్లో దళితులు రచ్చబండపై కూర్చోవడానికి వీల్లేదు. ఇప్పటికీ అక్కడ ఏడు గ్రామాల్లో టీ కొట్లలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూ ఉంది. ఆరు గ్రామాల్లో దళితుల్ని హొటళ్ళ లోకి అసలే అనుమతించరు. ఇరవైఏడు గ్రామాల్లో చాకలివారు దళితుల బట్టలు ఉతకరు. తొమ్మిది గ్రామాల్లో క్షురకులు దళితులకు క్షవరం చేయరు. ఈ పనుల "జుట్టు కత్తిరించడం మంగలి యొక్క పవిత్రమైన ధర్మం కాదు. ఇది ఒక వ్యాపారం. చెప్పులు కుట్టడం మాదిగవాడి పవిత్ర ధర్మం కాదు. అది కూడా వ్యాపారమే! ప్రదర్శించే పూజలు, హొమాలు, ఉత్సవాలలో కూడా అది జరుగుతోంది. ఇది బ్రాహ్మణుడి పవిత్రమైన ధర్మమేమీ కాదు. అలా అనుకోవడం మన అజ్ఞానం. మన అజ్ఞానం మీదే బ్రాహ్మణుడికి తిని కూర్చునే పెద్ద వ్యాపారం జరుగుతూ ఉంది!" అన్నారు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆధునికులుగా మనకు తోచకపోతే పోయింది. కనీసం కొందరు మహానుభావులు చెప్పిన దాంట్లోంచి సారాంశమైనా గ్రహించాలి కదా? ఇదే విషయం మీద డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఏం చెప్పారో గమనించండి..."బ్రాహ్మణులు, కోమట్లు, షేక్‌లు, సయ్యద్‌లు పెద్ద కులాలకు చెందినవారు. కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, సాలె, మాల, మాదిగలు చిన్న కులాల వారు. వీరి సంఖ్య 90 శాతం దాకా ఉంది. కుల భేదాల వల్ల వీరి మేధస్సు బందీ అయిపోయింది. వీరిని పైకి తెస్తే తప్ప, దేశ పునర్నిర్మాణం జరగదు. కాళ్ళూ, చేతులూ కదిలించకపోతే శరీరానికి పక్షవాతం వచ్చినట్లు... దేశానికీ పక్షవాతం వచ్చింది. దేశంలోని ఈ 90 శాతం ప్రజలకు రెండు వేల సంవత్సరాలుగా పక్షవాతం వచ్చింది. సమాజంలో వీరిని ఎక్కడికక్కడ పాతరేసి స్థిరపరిచారు. కదలిక లేకుండా చేశారు. బానిసత్వానికి మూల కారణం ఇదే. ఇప్పటికైనా మారకపోతే మరోసారి బానిసలయ్యే ప్రమాదముంది." ఇలాంటి హెచ్చరికల్ని మనం ఇప్పటికైనా పట్టించుకోవాలా? వద్దా? ఇరవై ఒకటవ శతాబ్దపు అత్యాధునికులమని గొప్పలు పోవడం కాదు, అందుకు తగిన విధంగా ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంది. మంత్రాలయ మఠంలో– చదువుకున్న దళితులైనా సరే, కేవలం ఊడ్చడానికే అర్హులు! ఆ పని తప్ప మరో పని చేయనివ్వరు. బిల్లులు రాయడానికి గానీ, రిసెప్షనిస్టులుగా పని చేయడానికి గానీ వారికి అవకాశమివ్వరు. అక్కడవారు చదువుకున్న చదువు వృధా కావల్సిందే! కొన్ని ఊళ్ళలో దళితులు మోటారు వాహనాలపై తిరగకూడదు. పెళ్ళి ఊరేగింపులు సైతం వాహనాలపై చేసుకోగూడదు. కాలి నడకన వెళ్ళాల్సిందే. మంచి నీటి బావుల్లోకి సైతం దిగనివ్వరు. బావిలోంచి నీరే తోడుకోనివ్వనప్పుడు, ఇక నీళ్ళలోకి దిగి పనులు చేయనిస్తారా? దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడమన్నది ఊహకు అందని విషయం. మంత్రాలయ మండలంలోని బసాపురంలో పెత్తందార్ల కార్లు వెళుతూ ఉంటే ఎంతటి విద్యావంతులైన దళితులైనా సరే... టక్కున లేచి నిలబడి వంగి నమస్కారం పెట్టాల్సిందే. కర్నూలు మండలం దేవమడ గ్రామంలోనూ ఇంకా కొన్ని చుట్టుపక్కల గ్రామాల్లోనూ గ్రామ వాలంటీర్లు దళితుల ఇళ్లకు వెళ్ళరు. వాళ్ళనే తమ ఇళ్ళకు పిలిపించుకుంటారు. ఊళ్ళోని ప్రతి ఇల్లూ తిరగడమన్నది గ్రామ వాలంటీర్ల ఉద్యోగ ధర్మం. దాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం ఎంత తప్పు? అయితే వారిని అడిగేవారు లేరు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇంతటి వివక్ష కొనసాగుతూ ఉందంటే... మనుషులుగా మనమంతా తల వంచుకోవాలి. అన్ని వర్గాల వారికి సమ న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వోద్యోగులు, పాలకులు సిగ్గుపడాలి ! కర్ణాటక లోని కొప్పల్ జిల్లా మయాపూర్ గ్రామంలో అగ్రవర్ణం వారు దళిత కుటుంబానికి ఇరవై అయిదు వేల రూపాయల జరిమానా విధించారు. ఎందుకంటే ఒక దళితుడు గుడి బయట నిలబడి, కళ్ళు మూసుకుని దేవుడికి దండం పెట్టుకుంటున్నాడు. ఆ సమయంలో వెంట ఉన్న అతని రెండేళ్ల కొడుకు గబుక్కున గుళ్ళోకి వెళ్ళిపోయాడు. తను దళితుడినని, తను గుళ్ళోకి వెళ్ళకూడదని ఆ పసివాడికి తెలియదు. ఆ రోజు ఆ పసివాడి పుట్టిన రోజు. అందుకే వాణ్ణి తీసుకుని తండ్రి గుడికి వెళ్ళాడు. వాణ్ణి చల్లగా చూడమని కోరుకుంటూ ఆ దళితుడు దండం పెట్టుకుంటూ ఉండగా...ఆ "ఘోర ప్రమాదం" జరిగిపోయింది. ఒక దళితుడు గుళ్ళోకి జొరబడ్డాడని, గుడి మైల పడిందనీ, దాన్ని ప్రక్షాళన చేయాలని...అందుకు రూ.25 వేలు ఖర్చు అవుతుందనీ పూజారులు బెదిరించారు. తనకు అంత శక్తి లేదని, తను ఒక నిరుపేదనని దళితుడు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. అగ్రవర్ణ అహంకారం తగ్గలేదు. పెద్ద గలాటా జరిగింది. ప్రభుత్వాధికారుల చొరవతో విషయం సద్దుమణిగింది. ఇంగిత జ్ఞానం లేక, మానవత్వం లేక మనుషులు ప్రవర్తిస్తున్నప్పుడు–గోరుతో పోయేది గొడ్డళ్ళ దాకా వస్తుంది. ఇది 2021 సెప్టెంబర్ సంఘటన. ఇలాంటి సంఘటనే తమిళనాడులో జరిగింది. ఒక గుళ్ళోకి దళిత మహిళను రానియ్యలేదు. ఆ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలిసింది. వెంటనే ఆ గుడికి సంబంధించిన ఇరవైమంది పూజారుల మీద ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టించి వారిని జైలుకు పంపారు. ఇతర రాష్ట్రాలలో కూడా అలా చేయగలిగే అవకాశం ఆయా మంత్రులకు, ముఖ్యమంత్రులకు ఉంటుంది. రాజ్యాంగం గురించి అందరూ గొప్పగా మాట్లాడుతారు కానీ, ఎవరైనా అలా చేస్తున్నారా ? మహిళల అభ్యున్నతికై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్త్రీలకు బస్సు ప్రయాణం ఉచితం చేశారు. ఒకరోజు కన్యాకుమారి జిల్లా వాణీయం కుడి గ్రామానికి చెందిన సెల్వం అనే డెబ్బయ్యేళ్ల మహిళ తన చేపల బుట్టతో బస్సు ఎక్కింది. చేపలు వాసన వస్తున్నాయంటూ కండక్టర్ బలవంతంగా ఆమెను బస్సు నుండి దింపేశాడు. అవి నిలువ చేపలు కావని, ఆ రోజు పట్టినవేనని, చేపలన్నాక కొంచెం వాసనొస్తాయనీ, అయినా తను ఎక్కువ దూరమేమీ రావడం లేదని ఆ వృద్ధురాలు ఎంత మొత్తుకున్నా కండక్టర్ వినలేదు.

# మాతో పెట్టుకోకు !




'కేంద్ర పశు సంవర్ధక శాఖ డౌన్ డౌన్" అని గట్టిగా ఆంబోతులు రంకెలు వేస్తున్నట్టు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆ శబ్దాలు వినవస్తున్న దిశగా పరిగెత్తాను. చూతును కదా! కలెక్టర్ కార్యాలయం దగ్గర వందలకొద్దీ ఆంబోతులు గుమిగూడాయి. వాటిలో కొన్ని ముసిలి ఆంబోతులు కలెక్టరాఫీసు ముందు కాళ్ళు మునగదీసుకుని బైఠాయించాయి. కలెక్టర్ గారితో సహా యావన్మందీ లోపలికి వెళ్ళలేక, ఏంచేయాలో తోచక బిక్కమొహాలు వేసుకుని చూస్తున్నారు. పోలీసు పటాలాలు వచ్చాయి. ఆంబోతుల మీద లాఠీ చార్జి చేయబోతే అవి తిరిగి కొమ్ములతో కుమ్మేశాయి. ఆ వైనం చూసిన పోలీసు కమిషనర్ వెంటనే లాఠీచార్జి ఆపెయ్యమని ఆదేశాలు ఇచ్చాడు. ఒకానొక ఉత్సాహవంతుడైన, తొందరగా ప్రమోషన్లు కొట్టేయాలన్న యావ బాగా ఉన్న ఒకానొక సర్కిల్ గారు నీటి ఫిరంగులను ప్రయోగించమని సూచించేడు. కమిషనర్‌కి ఆ సలహా నచ్చింది. కాని ఆ నీటి ఫిరంగుల ప్రయోగం కాస్తా బెడిసికొట్టింది. ట్యాంకర్ లోని నీళ్ళన్నీ అయిపోయాయి కాని ఆంబోతులు కదల్లేదు. ఎప్పటినుంచో స్నానాలు లేకుండా ఉన్నాయేమో మహదానందంగా నీటి ఫిరంగుల ప్రయోగాన్ని ఆస్వాదించాయి. పనికిమాలిన సలహా ఇచ్చాడని కమిషనర్ సదరు సిఐ మీద మండిపడ్డాడు. ఆ సిఐ తన ప్రమోషన్ కోరికను వదిలేసుకుని అక్కడినుంచి చల్లగా జారుకున్నాడు. తమను ఈ లోగా సంప్రదించిన కలెక్టర్ గారికి " మనుషుల మీద మీ పోలీసులు వ్యవహరించినట్టు పశువుల యెడల వ్యవహరిస్తే గనుక అది జంతుహింస చట్టం వర్తించే వ్యవహారంగా మారిపోయి మీ మెడకు చుట్టుకోగలదు జాగ్రత్త" అని హెచ్చరించేరు న్యాయ కోవిదులు. తమకు తెలిసినంతవరకూ సెక్షన్ 144లు, సెక్షన్ 30లు, 351లు వగైరాలన్నీ జంతువులకి వర్తించిన దాఖలాలు ఏవీ లేవని కూడా స్పష్టం చేసేరు. ''పోనీ, పులుల్నో, సింహాల్నో రప్పిద్దామేమిటి?" అని కలెక్టర్ గారు అడిగితే ''అసలే అవి అంతరించిపోతున్న జాతులు. వాటిని రంగంమీదకు తెస్తే అంతర్జాతీయ సమస్య అయిపోతుంది జాగ్రత్త '' అని చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ కి వార్నింగిచ్చేడు.మరేమిటి దారి? ఎన్నో చిక్కు సమస్యల్ని పరిష్కరించిన అనుభవం ఉన్న ఒకానొక మాజీ అయ్యేయెస్ ని సలహా అడిగేరు. "అయ్యా! ఇది పశువులతో వ్యవహారం. మనుషులతోనైతే వేరు. పశువులతో ప్రజాస్వామ్య పద్ధతి తప్ప మరో విధంగా వ్యవహరించలేం. సంప్రదింపులే శరణ్యం" అని ఆయన సలహా ఇచ్చేడు. పశువులతో డీల్ చేయడంలో తలపండిన వారెవరని వెతకగా ఒకానొక బందెలదొడ్డి నిర్వాహకుడు తగిలేడు. అతగాడిని బతిమాలి, కాళ్ళూ, గెడ్డం పట్టుకుని మొత్తానికి చర్చలకు పంపేరు.ఓ లారీడు పచ్చిగడ్డి వెంటరాగా ఆ మధ్యవర్తి చర్చలకు పయనమయ్యాడు. మొత్తానికి సుదీర్ఘచర్చల తర్వాత ఆ మధ్యవర్తి వెనక్కి వచ్చేడు. కేంద్ర పశుసంవర్ధక శాఖ ఫిబ్రవరి 14ను "పశు కౌగిలి" దినంగా అమలు జరపమన్న సర్క్యులర్ ను బేషరతుగా ఉపసంహ రించు కోవాలన్నదే ఆంబోతుల డిమాండ్ అని అధికారులకు వివరించేడు. కలెక్టర్ గారికి గాని అక్కడున్న అధికారులకి గాని ఆ డిమాండ్ అంతుపట్టలేదు. పశువులని ప్రేమించమంటే అందుకు అభ్యంతరం ఆ పశువుల నుంచే ఎందుకొచ్చిందో వాళ్ళకి బోధపడడం లేదు. అప్పుడు ఆ మధ్యవర్తి ఆందోళనకారుల వినతి పత్రాన్ని వాళ్ళకి చూపించేడు. అందులో ఇలా ఉంది: ''ఇన్నేళ్ళుగా మా మెడలకి కాడి కట్టి దున్నించేరు. బళ్ళు లాగించేరు. గానుగలు ఆడించేరు. రిటైర్ అవగానే కబేళాలకి పంపేరు. ఇక మా ఆడవాళ్ళని పాడి కోసం వాడుకున్నప్పుడు మా బిడ్డలకి దక్కవలసిన పాలు దక్కకపోయినా భరించాం. ఎందుకు? మేం పశువులం గనక. ఇతరులకు ఉపయోగపడాలన్నదే మా జీవిత పరమార్ధం అని మాకు తెలుసు గనక. కాని ఇప్పుడు మీ అకృత్యాలు మితి మీరిపోయాయి. ఇక సహించం. తక్కిన ప్రపంచం అంతా ప్రేమికుల దినంగా జరుపుకుంటున్న ఫిబ్రవరి 14న మీరు పశుకౌగిలి దినం పాటించమని ఆదేశాలు ఇచ్చారు. ఇక ప్రతీ వాడూ వచ్చి మమ్మల్ని వాటేసుకుంటాడన్నమాట. మీ మనుషులకి ఇంగిత జ్ఞానం పోయిందని అర్ధం అవుతోంది. మేం పశువులమనుకున్నారా? మనుషులమనుకున్నారా? ఖబడ్దార్ ! మర్యాదగా వెంటనే ఆ దిక్కుమాలిన సర్క్యులర్ ని వెనక్కి తీసుకోండి."కలెక్టర్ గారు వెంటనే ఆ వినతి పత్రాన్ని కేంద్ర పశు సంవర్ధక శాఖకి ఆగమేఘాల మీద పంపేడు. కాని ఆ మేఘాలు ఢిల్లీ వెళ్ళేలోపు గాలివాన వచ్చి చెదిరిపోయాయి.ఆ రోజు ఫిబ్రవరి పదిహేను. ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. కాజువాలిటీ వార్డు ఇన్‌చార్జి రిపోర్టు తయారుచేసేడు. "పశు కౌగిలి దినం సందర్భంగా ఆ పశువులని ముందు నుంచి వాటేసుకోబోయి కొమ్ములు గుచ్చుకుని గాయపడినవారు మూడు వందల డెబ్భై మంది. వారిలో దాదాపు మూడు వందల మంది పరిస్థితి విషమంగా ఉంది. పక్కనుంచి పశుకౌగిలి కోసం ప్రయత్నించి ఆ పశువుల గిట్టల కింద నలిగి ఫ్రాక్చర్లు అయినవాళ్ళు ఆరు వందల తొంభై మంది, వారిలో ఎక్కువమందికి చెప్పరానిచోట్ల చితికిపోయి ట్రామా లోకి వెళ్ళిపోయారు. ఇక వెనకనుంచి వాటేసుకోబోయి ఆ పశువుల వెనక కాళ్ళు ఝాడించి తన్నిన కారణంగా మూతిపళ్ళు రాలిపోయినవారు రెండు వేలమందికి పైగానే ఉంటారు. ఇంకా ఎంతమంది బాధితులున్నారో తెలియదు." అని ఆ రిపోర్టులో ఉంది. ఢిల్లీ లోని ఎయిమ్స్‌లో పశుకౌగిలి దినం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వ్యవసాయ శాఖామాత్యుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని టీవీ చానెళ్ళు బ్రేకింగ్ న్యూస్ ఇస్తున్నాయి. "మమ్మల్ని బలవంతం చేసే మృగాళ్ళని ఏంచేయాలో ఇప్పుడు బాగా తెలిసింది" అని మహిళా లోకం యావత్తూ ముక్తకంఠంతో ప్రకటించింది.తన శిష్య బృందాన్ని చుట్టూ కూచోబెట్టుకుని స్వామి అలౌకికానంద తీర్థులవారు ''నోరూ వాయీ లేదని పశువులని చులకనగా చూడవద్దు. ఎవరితోనైనా పెట్టుకోవచ్చు గాని పశువులతో మాత్రం పెట్టుకోవద్దు" అని బోధ చేశారు.

''అవునవును...పశువులతో మాత్రం పెట్టుకోవద్దు...పంచరైపోతుంది. అయినా పశువులను ప్రేమగా, లాలనగా దగ్గరకు తీసుకోవడానికి ప్రత్యేకంగా ఒక రోజు కావాలా ఏంటి? ఆ పని ఎప్పుడైనా చేయొచ్చుకదా..!" అంటున్న నన్ను తట్టి మరీ నిద్ర లేపింది మా శ్రీమతి. "ఏవండీ కలగంటున్నారా? ఆఖరికి మీరు కలవరించిందే జరిగిందండీ. కేంద్ర పశు సంవర్ధక శాఖ 'కౌ హగ్ డే' ఆలోచనను వెనక్కు తీసుకుందట..." అనడంతో ''...అయితే కలలోలా ఎవరికీ ఏ గాయాలూ కావన్నమాట... హమ్మయ్య." అని ఊపిరి పీల్చుకున్నాను.

# సాహొరే బ్రెజిల్

ప్రపంచవ్యాప్తంగా 'పెట్టుబడి' రాకాసికి తలొగ్గి పర్యావరణాన్ని, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న పాలకులకు పూర్తి భిన్నమైన మార్గంలో బ్రెజిల్ అధ్యక్షులు, వర్కర్స్ పార్టీ నేత లూలా డ సిల్వా నడుస్తున్నారు. ప్రజల ప్రాణ రక్షణకు ప్రత్యేకించి అమాయకులైన ఆదివాసీల సంక్షేమం విషయంలో మడమ తిప్పని నేతగా లూలా ప్రఖ్యాతినొందారు. ప్రపంచ ఊపిరితిత్తులుగా భావించే అమెజాన్ అడవుల్లో అక్రమ ఖనిజ తవ్వకాలకు పాల్పడుతున్నవారిపై యుద్ధం ప్రకటించారాయన. ఇదేమీ చిన్న విషయం కాదు. అమెరికా కీలుబొమ్మ బోల్సోనారో నేతృత్వంలోని గత ప్రభుత్వం అమెజాన్ అడవుల్లో అక్రమ బంగారం తవ్వకాలకు లాకులెత్తి అక్కడి మూలవాసులైన యనోమామి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. అక్రమ ఖనిజ తవ్వకాలను అడ్డుకునేందుకు యత్నించిన యనోమామి ప్రజలపై మైనింగ్ మాఫియా క్రూరమైన దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. భారీ స్థాయిలో అమెజాన్ అడవుల విధ్వసమూ జరిగిపోయింది. పరిసర ప్రాంతాల్లోని యురారికో ఎరా వంటి నదీ జలాలన్నీ ఖనిజ వ్యర్థాలతో కాలకూట విషంగా మారిపోయాయి. యనోమామి ప్రజలు అంతుచిక్కని వ్యాధుల బారినపడ్డారు. పోషకాహారలేమితో, నయం కాని రుగ్మతలతో ఆ ప్రాంతం నిస్తేజంగా మారింది. ఇంతటి విధ్వంసం యథేశ్ఛగా సాగిపోవాడానికి అక్రమ మైనర్లకు అండగా నిలిచిన అప్పటి బోల్సోనారో ప్రభుత్వమే ప్రధాన కారణం. అక్రమ మైనింగ్ కారణంగా అమెజాన్ అడవుల్లో మానవ హననం జరిగిపోతోందంటూ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘంతో సహా అనేక పర్యావరణ, పౌర హక్కుల ఏజెన్సీలు నెత్తినోరూ మొత్తుకున్నా.. దున్నపోతుపై వర్షం పడిన చందంగా బోల్సోనారో వ్యవహరించారు.పోర్చుగీసులో గ్యారిపేయిరస్‌గా పిలుచుకునే అక్రమ బంగారు ఖనిజ తవ్వకందార్లు 1970, 80లలోనే యనోమామి భూముల్లోకి చొరబడి ఖనిజ తవ్వకాలను యథేచ్ఛగా సాగించారు. ఆ తర్వాత 1990లలో యనోమామి ప్రజల భూభాగాన్ని 96 లక్షల హెక్టార్లకు కుదించి మైనింగ్ నుంచి ఆ ప్రాంతాన్ని మినహాయించారు. లక్షలాది మంది అక్రమ ఖనిజ తవ్వకం దార్లను యనోమామి భూభాగం నుంచి వెళ్లగొట్టారు. 2018 ఎన్నికల్లో పచ్చి మితవాద నాయకుడు బోల్సోనారో అధ్యక్షుడవ్వడంతో అక్రమార్కులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. కుదించిన యనోమామి భూభాగంలోనూ ఖనిజ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోయాయి. అత్యంత విలువైన ఖనిజ సంపదను మూలవాసులకు ఎలా వదిలేస్తామంటూ? బోల్సోనారో నిర్లజ్జగా ప్రకటించారు. దీంతో అమెజాన్ అడవుల్లో మారణహొమం సాగింది. 'ఆదివాసీల నెత్తుటి రుచి మరిగిన ప్రభుత్వం'గా యనోమామి ప్రజలు బోల్సోనారో సర్కార్‌పై పోరు సల్పారు. వారికి లూలా డ సిల్వా అండగా నిలిచారు. పాశ్చాత్య దేశాల కుట్రలతో అక్రమ కేసుల్లో జైలు పాలైన లూలా గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అద్భుత విజయం సాధించారు. ఈ ఏడాది జనవరి 1న బాధ్యతలు చేపట్టినదే తడవుగా ప్రజా సంక్షేమాలు ఒక వైపు కొనసాగిస్తూనే సహజ వనరులను, పరిశ్రమలను జాతీయం చేస్తూ సాహొరే బ్రెజిల్ అంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. బోల్సోనారో వినాశకర విధానాలన్నిటినీ క్రమంగా రద్దు చేసి ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. పెట్టుబడి మత్తులో జోగుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ భజన చేస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలకు వామపక్ష ప్రత్యామ్నాయ దీపస్తంభంగా నిలుస్తున్నారు. 'అక్రమ మైనింగ్ పరిసమాప్తి అయ్యేదాక విశ్రమించ'బోమన్న నినాదంతో సమరభేరీ మోగించి పర్యావరణ పరిరక్షణ పట్ల, ఆదివాసీ ప్రజల పట్ల వామపక్షాలకున్న నిబద్ధతను చాటి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ గురించి ప్రపంచ మానవాళికి ఒకవైపు నీతులు చెబుతూ ఇంకోవైపు నుంచి గోతులు తవ్వుతున్న అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు బ్రెజిల్ చేపట్టిన ఆపరేషన్ ఒక గుణపాఠం. హిండెన్‌బర్గ్ నివేదికతో కలుగులోపడిన ఎలుకలా గిలగిలకొట్టుకుంటున్న గౌతమ్ అదానీ లాంటి కార్పొరేట్ పెద్దలకు కోస్తా తీరాన్ని, ఏజెన్సీ ప్రాంతాన్ని ఇంధన, ఖనిజ తవ్వకాల కోసం కారుచౌకగా దోచిపెడుతున్న కేంద్రంలోని మోడీ సర్కార్ కానీ, ఇటు వేలాది ఎకరాలను అప్పనంగా కట్టబెడుతున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కానీ బ్రెజిల్ వామపక్ష ప్రభుత్వ సాహసోపేత చర్యల నుంచి నేర్వాల్సిన పాఠాలు చాలానే వున్నాయి. పర్యావరణహితం కోసం, ఆదివాసీల మనుగడ కోసం బ్రెజిల్ సాగిస్తున్న పోరాటాన్ని మనసారా అభినందిద్దాం.

## గసగసాల్లో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో..




గసగసాలు.... ఈ మసాలా దినుసును ఎంతో అరుదుగా వాడుతూ ఉంటాం. కానీ దీనిలోని పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

మలబద్ధకం: గసగసాలు అపాన వాయువుల ఉత్పత్తిని తగ్గించి, మలబద్ధకాన్నినివారిస్తాయి. పొట్ట నిండిన భావాన్ని కలిగించి ఆకలిని నియంత్రిస్తాయి. అజీర్తి, పొట్టలో అసౌకర్యం, ఉబ్బరం ఉన్నవాళ్లు తరచుగా ఈ మసాలా దినుసును వంటకాలకు జోడిస్తూ ఉండాలి. గసగసాల్లో ఎంతో ఎక్కువ పీచు ఉంటుంది. ఇది అజీర్తిని తొలగించి సుఖ విరేచనం కలిగేలా చేస్తుంది.

నిద్ర సమస్యలు: ఇన్సోమ్నియా వంటి నిద్ర లేమిని తొలగించాలంటే గసగసాలను పాలు , చక్కెరల తో కలిపి తీసుకోవాలి. నిద్ర సమస్యను పరిష్కరించడంలో గసగసాలు సాటిలేనివి. అయితే ఆ పానీయం నిద్రకు గంట ముందు తీసుకుంటే తప్పక ఫలితం దక్కుతుంది.

శ్వాసకోశ సమస్యలు: ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు గసగసాలను ఆహారంలో చేర్చుకోవాలి. ఊపిరితిత్తుల్లో నెమ్ము, కఫాలను కరిగించి శ్వాసకోశ వ్యవస్థను తేలిక పరిచే శక్తి వీటికి ఉంటుంది. అలాగే దగ్గును తగ్గించి, ఉపశమనాన్ని కలిగిస్తుంది.

విపరీత స్థితులు: కొలెస్ట్రాల్‌లో హఠాత్తుగా పెరుగుదల కనిపించి గుండెపోటుకు గురయ్యే పరిస్థితి నుంచి తప్పించుకోవాలన్నా గసగసాలను తినాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపుటలవాట్లతోపాటు గసగసాలతో కూడిన ఆహారానికి ప్రాధాన్యం ఇస్తే గుండె సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. గసగసాల్లో అత్యధికంగా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కాబట్టి తీవ్ర రుగ్మతలకు గురవకుండా ఉండాలంటే సాధ్యమైనంత తరచుగా వీటిని ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి.

మూత్రపిండాల్లో రాళ్లు: పీచు, యాంటీఆక్సిడెంట్లు కలిగి ఉండే గసగసాలు తినడం ద్వారా శరీరంలోని విషాలు తేలికగా విసర్జింపబడతాయి. ఫలితంగా మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఈ విషాలను ఎప్పటికప్పుడు బయటకు వెళ్లకపోతే అవి మూత్రపిండాల్లో రాళ్లుగా మారతాయి. దీర్ఘకాలంలో ఈ రాళ్ల కారణంగా మూత్రపిండాలు దెబ్బతిని మూత్ర వ్యవస్థ పనితీరు దెబ్బ తింటుంది.

నొప్పి నివారిణి: నొప్పి ఏ కారణంగా, ఏ ప్రదేశంలో తలెత్తినా గసగసాలు నమలడం వల్ల ఉపశమనం దక్కుతుంది. దంతాల నొప్పులు, కండరాలు, నరాల నొప్పులను గసగసాలు తగ్గిస్తాయి. అయితే ఈ నొప్పులు రోజుల తరబడి వేధిస్తుంటే తప్పక వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

# ఈ సెంట్ కొట్టాలంటే కోట్లు కుమ్మరించాల్సిందే!




సెంట్ బాటిల్ చూడటానికి చిన్నగా కనిపించొచ్చు... కానీ దాని గుభాళింపు చాలా ఖరీదుతో కూడుకున్న వ్యవహారమే. సాధారణంగా ఒక పర్ఫ్యూమ్ బాటిల్ ధర ఎంతుంటుంది? అంటే... మహా అయితే వెయ్యి రూపాయలు ఉంటుందంటారు. కానీ కొన్ని పర్ఫ్యూమ్ బాటిల్స్ కొనాలంటే లక్షలు, కోట్లు కుమ్మరించాల్సిందే. వజ్రవైడూర్యాలు పొదిగిన ఆ అత్తరు బాటిళ్లను చూస్తేనే మత్తెక్కడం, మతిపోవడం ఖాయం. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పర్ఫ్యూమ్‌లుగా గుర్తింపు పొందిన అలాంటి కొన్ని సెంట్ బాటిళ్ల విశేషాలివి...

130 ఏళ్ల ప్రత్యేకం...

ఇటలీకి చెందిన లగ్జరీ బ్రాండ్ బల్గారీ 130వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'ఒపెరా ప్రైమా' పర్ఫ్యూమ్‌ను విడుదల చేసింది. దీని ధర సుమారు రూ. 1.8 కోట్లు. ఈ పర్ఫ్యూమ్ బాటిల్ డిజైన్‌లో 250 క్యారెట్ల సిట్రిన్, 4.5 క్యారెట్ల అమెథిస్ట్, 25 క్యారెట్ల డైమండ్‌ను ఉపయోగించారు. నిమ్మ, నారింజపువ్వు, కస్తూరి వంటి సువాసనలతో కూడిన మెడిటరేనియన్ టోన్‌ను కలిగి ఉంటుంది.

గిన్నిస్ రికార్డులు...

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పర్ఫ్యూమ్ ఏదంటే... షుముఖ్. దీని ధర సుమారు రూ. 9.3 కోట్లు. 2019లో దుబాయి మాల్‌లో నబీల్ పర్ఫ్యూమ్స్ అనే సంస్థ దీన్ని విడుదల చేసింది. చందనం, ఇండియన్ అగర్‌వుడ్, ఇండియన్ రోజ్, అంబర్, టర్కిష్ రోజ్ ఆయిల్ వంటి సుగంధద్రవ్యాలతో ఈ అత్తరును తయారుచేశారు. అయితే బయటకు వెల్లడించని మరికొన్ని పదార్థాలు కూడా ఇందులో కలుపుతారు. ఈ పర్ఫ్యూమ్ ఖరీదుకు కారణం దాని ప్యాకింగ్. 3500 డైమండ్లు, ముత్యాలు, రెండున్నర కిలోల 18 క్యారెట్ల బంగారం, 5.9 కిలోల స్వచ్ఛమైన వెండితో రూపొందించిన ఖరీదైన ప్యాకింగ్‌తో దీన్ని అందిస్తారు. మూడు లీటర్ల పర్ఫ్యూమ్‌ను తయారుచేయడానికి మూడేళ్లకు పైగా శ్రమించారు. సరైన సువాసన కోసం 490 సార్లు ప్రయత్నించి చివరికి సఫలమయ్యారు. ఈ పర్ఫ్యూమ్ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను నమోదు చేసింది. ఎక్కువ డైమండ్లు కలిగి ఉన్న పర్ఫ్యూమ్ బాటిల్‌గా ఒక రికార్డు నెలకొల్పితే, రిమోట్‌తో పనిచేసే స్ప్రే బాటిల్‌గా మరో రికార్డును నమోదు చేసింది.

సెంట్ సీసా రాజసం...

ప్రపంచంలోనే రెండో ఖరీదైన పర్ఫ్యూమ్ 'డికేఎన్‌వై గోల్డెన్ డెలిసియస్'. ప్రముఖ డిజైనర్ డికేఎన్‌వై, మరో ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ మార్టిన్ కట్జ్‌తో కలిసి ఈ ఖరీదైన పర్ఫ్యూమ్‌ను తయారుచేశారు. ఆపిల్ ఆకారంలో ఉండే పర్ఫ్యూమ్ సీసాను ప్రపంచం నలుమూలల నుంచి సేకరించిన అత్యంత విలువైన 2909 స్టోన్స్‌తో డిజైన్ చేశారు. అందులో 183 కనకపుష్యరాగం, 2700 వైట్ డైమండ్స్, శ్రీలంక నుంచి సేకరించిన 7.18 క్యారెట్ల ఓవల్ కాబోకాన్ సఫైర్, ఆస్ట్రేలియా నుంచి తెచ్చిన 15 గులాబీ రంగు వజ్రాలు, 3.07 క్యారెట్ల ఓవల్ రూబీ, 4.03 క్యారెట్ల పియర్ షేప్డ్ రోజ్ కట్ డైమండ్‌తో డిజైన్ చేశారు. 2.43 క్యారెట్ల యెల్లో డైమండ్‌తో చేసిన సీసా క్యాప్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఇంతటి విలువైన రాళ్లతో ఒక సీసాను డిజైన్ చేయడానికి కనీసం 1500 గంటల సమయం పడుతుందట. ఇక దీని ధర సుమారు రూ. 7.7 కోట్లుగా ఉంది.

లగ్జరీ బ్రాండ్

ఫ్రెంచ్ పర్ఫ్యూమర్ ఎర్నెస్ట్ డాల్టాఫ్ 1904లో 'కారన్స్ పోవెర్' అనే పర్ఫ్యూమ్ తయారీ సంస్థను స్థాపించారు. ఫ్రాన్స్‌లో ఇది ఒక లగ్జరీ బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. ఈ పర్ఫ్యూమ్ బాకార్ట్ క్రిస్టల్ బాటిల్‌లో బంగారు మూతతో ఆకట్టుకునేలా ఉంటుంది. 1954లో మొదటిసారి ప్రత్యేకంగా మహిళల కోసం ఈ స్పైసీ సువాసనతో కూడిన పర్ఫ్యూమ్‌ను తయారుచేశారు. అయితే మహిళలతోపాటు పురుషులను సైతం ఈ పర్ఫ్యూమ్ బాగా ఆకర్షించింది. లవంగాలు, మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు, జేరేనియం, గులాబీ, మల్లె, ఓక్‌మాస్, ఒపోనాక్స్, గంధం వంటి మిశ్రమాల కలయికతో ఈ పర్ఫ్యూమ్‌ను తయారుచేస్తున్నారు. 90 ఎంఎల్ బాటిల్ ధర రూ. 2 లక్షలుగా ఉంది.

మైఖెల్ జాక్సన్ మెచ్చాడు!

'కింగ్ ఆఫ్ పాప్'గా పేరొందిన మైఖెల్ జాక్సన్ ఇష్టపడిన పర్ఫ్యూమ్ 'జియానీ వీవ్ సుల్మాన్'. 1998లో మార్కెట్లోకి ఇది విడుదలైనప్పుడు కొన్ని బాటిల్స్‌ను ఆయన కొనుగోలు చేశారు. మల్లెపూలు, ప్రత్యేక గులాబీలను సేకరించి ఈ పర్ఫ్యూమ్‌ను తయారుచేశారు. బంగారంతో తయారుచేసిన సీసా, డైమండ్ స్టాపర్, పచ్చలు, కెంపులు, బంగారు తాళంచెవితో డిజైన్ చేసిన ఈ పర్ఫ్యూమ్ ధర సుమారు రూ. 68 లక్షలు.

అరుదైన సువాసన

లిమిటెడ్ ఎడిషన్‌లో విడుదల చేసిన 'చానెల్ గ్రాండ్ ఎక్స్‌ట్రేట్' పెర్ఫ్యూమ్ ధర సుమారు రూ. 2.7 లక్షలుగా ఉంది. బాటిల్ ప్రత్యేకమైన లుక్‌తో మాస్టర్‌పీస్‌లా ఉంటుంది. బాటిల్ డిజైన్ శిల్పకళను గుర్తుకుతెస్తుంది. ఈ పర్ఫ్యూమ్ వెదజల్లే సువాసన అత్యంత అరుదైనదిగా గుర్తింపు ఉంది. 1921లో కోకో చానల్, పర్ఫ్యూమర్ ఎర్నెస్ట్ కలిసి సంయుక్తంగా హై-ఎండ్ పర్ఫ్యూమ్స్ తయారీని ప్రారంభించారు.

'జార్'... హుషార్

హ్యాండ్ కట్ గ్లాస్ బాటిల్స్‌తో 'జార్ – బోల్ట్ ఆఫ్ లైటెనింగ్' పర్ఫ్యూమ్ లభిస్తుంది. 2001లో జార్ పర్ఫ్యూమ్స్ తయారీ సంస్థ 'బోల్ట్ ఆఫ్ లైటెనింగ్' పేరుతో ప్రత్యేకమైన సువాసన కలిగిన అత్తరును విడుదల చేసింది. ట్యూబెరోస్, ఓరియంటల్ పూల మిశ్రమంతో తయారుచేసిన ఈ పర్ఫ్యూమ్ సువాసన మనసును ఉత్తేజపరుస్తుంది. ఒక ఔన్సు ధర సుమారు రూ. 59 వేలుగా ఉంది. ప్యారిస్‌కు చెందిన జ్యువెలర్ జోసెఫ్ ఆర్థర్ రొసెంతల్ ఈ సంస్థను స్థాపించారు. ఆయన పేరును షార్ట్‌కట్‌గా చేసి 'జార్' అనే పేరుతో పర్ఫ్యూమ్స్ తయారీ సంస్థను ప్రారంభించారు.

సెంట్ 'మహారాణి'

'క్లైవ్ క్రిస్టియన్ పర్ఫ్యూమ్' సంస్థ ప్రపంచంలో ఫైనెస్ట్ పర్ఫ్యూమ్‌లు తయారుచేయాలనే లక్ష్యంతో 1872లో ప్రారంభమైంది. విక్టోరియా రాణి కిరీటం బొమ్మను తన పర్ఫ్యూమ్ బాటిల్స్‌పై ప్రచురించుకోవడానికి అనుమతి పొందిన ఏకైక సంస్థ ఇది. 5 క్యారెట్ల వైట్ డైమండ్, 18 క్యారెట్ గోల్డ్ కాలర్‌తో లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసింది. దీని ధర సుమారు రూ. 1.6 కోట్లు. 2005లో 10 బాకరాట్ క్రిస్టల్ బాటిల్స్‌ను విడుదల చేస్తే అందులో ఏడింటిని ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేశారు. మిగతా మూడు బాటిల్స్‌ని సంస్థ అన్ని దేశాలకు స్పెషల్ కలెక్షన్‌గా టూర్‌కి పంపించింది. రోజ్ ఆయిల్, జాస్మిన్, తాహితియన్ వెనిలాల కలయికతో ఈ పర్ఫ్యూమ్‌ను ప్రముఖ బ్రిటిష్ పర్ఫ్యూమర్ రొసాడొవ్ డిజైన్ చేశారు.

సెంట్ సీసాకు బంగారు తాళం చెవి...

'పాకో రాబన్నే వన్ మిలియన్ లక్స్ ఎడిషన్' కమర్షియల్ పర్ఫ్యూమ్. 18 క్యారెట్ల బంగారం, 0.3 క్యారెట్ల డైమండ్‌తో తయారుచేసిన సంప్రదాయ బాటిల్ వినియోగదారులను ఆకట్టుకుంది. ఈ బాటిల్‌ను నాణ్యమైన లెదర్ బ్యాగుతో అందిస్తారు. దానికి ఒక బంగారు కీ కూడా ఉంటుంది. నారింజ, గ్రేప్, పుదీనా, గులాబీ, దాల్చిన చెక్క, వైట్ వుడ్, అంబర్, పచౌలి వంటి మిశ్రమాలతో తయారుచేసిన పర్ఫ్యూమ్ ఇది. దీని ధర సుమారు రూ. 44 లక్షలు.

సెంట్ ఆఫ్ ది సెంచరీ

ప్రముఖ ఫ్రెంచ్ డిజైనర్ జాన్ పాటూ డిజైన్ చేసిన క్లాసిక్, ఎక్స్‌క్లూజివ్ పర్ఫ్యూమ్‌లలో జాయ్ ఒకటి. 2000 సంవత్సరంలో ఫ్రాగరెన్స్ ఫౌండేషన్ ఫిఫీ అవార్డు కార్యక్రమంలో జాయ్ పర్ఫ్యూమ్‌ను 'సెంట్ ఆఫ్ ద సెంచరీ'గా ఎన్నుకున్నారు. రకరకాల గులాబీలతో పాటు పదివేల మల్లెపూలను పర్ఫ్యూమ్ తయారీలో ఉపయోగించారు. ఈ పర్ఫ్యూమ్ ఒక ఔన్స్ ధర రూ. 65వేలుగా ఉంది.

# వెన్ను వేధిస్తోందా? వైద్యులు ఏమంటున్నారంటే..!

మేనుకు దన్నుగా ఉండే వెన్నులో సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకూడదు. లేదంటే చిటికలో పోయే సమస్యలు అదే పనిగా చీకాకు పెడతాయి. కొన్ని సందర్భాల్లో సర్జరీకి కూడా దారి తీస్తాయి అంటున్నారు నాడీ వైద్యులు.

వెన్నులో మెడ, వీపు, కటి భాగం (సర్వైకల్, థొరాసిక్, లంబార్).. ఈ మూడు ప్రదేశాల్లో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. వీటిలో తలెత్తే ప్రతి నొప్పినీ అంత తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేకపోయినా, కొన్ని నొప్పులను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. మరీ ముఖ్యంగా మెడలో వచ్చే నొప్పుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇక్కడి నాడులు దెబ్బతింటే చేతులు, కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయే ప్రమాదం ఉంటుంది.

మెడ సమస్యలు ఇవే!

సాధారణంగా మెడను శ్రమకు గురి చేసినప్పుడే మెడ నొప్పులు మొదలవుతాయి. ఎక్కువ సమయాల పాటు ఫోన్లు, ల్యాప్‌టాప్ లు వాడడం ద్వారా మెడను ఎక్కువ సమయం పాటు వంచి ఉంచడం వల్ల మెడ నొప్పులు మొదలవుతాయి. మెడ తలను మోయడానికి ఉపయోగపడుతుంది. ఎక్కువ సమయం పాటు నేరుగా చూడడానికి తగినట్టు మాత్రమే రూపొందింది. అలాగే తాత్కాలికంగా పక్కలకు, పైకి, కిందకు చూడవచ్చు. కానీ తాత్కాలికంగా చేయవలసిన ఈ పనులను ఎక్కువ సమయం పాటు కొనసాగిస్తే, మెడలో నొప్పులు మొదలవుతాయి. మన మెడ రివర్స్ 'సి' ఆకారంలో ఉంటుంది. మెడను ఎక్కువ సమయాల పాటు కిందకు వంచి ఉంచినప్పుడు, దాని ఆకారం నిటారుగా లేదా సాధారణ 'సి' ఆకారంలోకి మారుతుంది. ఈ మార్పుతో మెడ కండరాల మీద ఒత్తిడి పెరిగి, నొప్పులు మొదలవుతాయి. అయితే ఈ రకమైన నొప్పులు ఆయా అలవాట్లను సరిదిద్దుకుని, మెడ కండరాలకు విశ్రాంతినిస్తే సర్దుకుంటాయి. ప్రమాదాల్లో హఠాత్తుగా కుదుపుకు గురైనప్పుడు మెడ డిస్క్‌లు పట్టు తప్పుతాయి. దాంతో నాడి నొక్కుకుపోయి చేతుల్లో తిమ్మిర్లు, నొప్పి మొదలవుతాయి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నొప్పి పెరగడం, చేతులు పట్టు కోల్పోవడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు. వీలైనంత త్వరగా వైద్యులను సంప్రతించి, చికిత్స మొదలుపెట్టాలి.

ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలి?

మెడ నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు. పక్కలకు, పైకీ, కిందకూ తలను తిప్పలేకపోతుంటే వైద్యులను తప్పక సంప్రతించాలి. బైక్ లేదా కారు నడుపుతూ సడెన్ బ్రేక్ వేసినప్పుడు, టు వీలర్ మీద నుంచి పడిపోయినప్పుడు, తల ఒక్కసారిగా కుదుపుకు గురవుతుంది. ఇలాంటి హై వెలాసిటీ ఇంజురీస్‌తో మెడ విప్లాషకు గురవుతుంది. ఆ తర్వాతి నుంచి మెడలో, చేతుల్లో అసౌకర్యం, నొప్పి మొదలైతే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. ఒకవేళ నొప్పి తక్కువగా ఉండి, మెడలో ఎలాంటి అసౌకర్యం లేకపోతే ఒకట్రెండు రోజులు పెయిన్ కిల్లర్స్ వాడి, విశ్రాంతి తీసుకుని అప్పటికీ మెడలో అసౌకర్యం తగ్గకపోతే వైద్యులను కలవాలి.

సొంత చికిత్సలు ప్రమాదకరం

సాధారణంగా మెడ నొప్పులను మనందరం ఎంతో కొంత నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. వైద్యుల దగ్గరకు వెళ్లకుండానే స్వయంగా తగ్గించుకునే ప్రయత్నాలను మొదలుపెడతాం. కొందరు అందుకోసం మర్దనను ఎంచుకుంటే, ఇంకొందరు యోగా, స్ట్రెచింగ్ వ్యాయామాలను ఎంచుకుంటూ ఉంటారు. కానీ ఇలాంటి వాటి వల్ల సమస్య మరింత పెరుగుతుంది. సమస్యను అంచనా వేసిన తర్వాత, ఇలాంటివి చేయించుకోవడం సురక్షితమని వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని అనుసరించాలి. అలా కాకుండా వైద్యులు వీటిని వారించినప్పటికీ, మర్దన, యోగా (%శీస్త్రు%), ట్రాక్షన్‌లను ఎంచుకోవడం వల్ల అప్పటికే ఉన్న సమస్య రెట్టింపవుతుంది. హఠాత్తుగా చేతులు పట్టు కోల్పోవడం, నొప్పి పెరిగిపోవడం జరుగుతుంది.

ఈ లక్షణాలు నిర్లక్ష్యం చేయకూడదు

మెడలో నొప్పి

మెడను తిప్పలేకపోవడం

చేతుల్లో నొప్పి, తిమ్మిర్లు

చేతులు పట్టు కోల్పోవడం

చేతులు పైకి ఎత్తలేకపోవడం

చేతులు మొద్దుబారిపోవడం

తుమ్మినా, దగ్గినా షూటింగ్ పెయిన్ రావడం

వెన్ను మధ్యలో సమస్యలు

శరీరంలోని ప్రతి అవయవానికీ సంబంధించిన నాడులన్నీ వెన్నుపూసలోనే మొదలవుతాయి. వెన్నులోని పూసల్లో సమస్య ఏర్పడి, ఆ ప్రదేశంలోని నాడులు నొక్కుకుపోతే, దాంతో సంబంధం ఉన్న అవయవాల పనితీరు మీద ప్రభావం పడుతుంది. హై వెలాసిటీ ఇంజురీస్‌లో థొరాసిక్ (మొండెం) ప్రాంతంలో ఫ్రాక్చర్లు జరుగుతూ ఉంటాయి. ఈ ప్రాంతంలో తలెత్తే ట్యూమర్ల వల్ల కూడా వెన్ను సమస్యలు మొదలుకావచ్చు. మూత్రవిసర్జన మీద కూడా పట్టు కోల్పోవచ్చు. కాబట్టి వెన్ను మధ్యలో నొప్పితో పాటు చేతులు, కాళ్లు పూర్వంలా పని చేయకపోతే వైద్యులను సంప్రతించి పరీక్షలు చేయించుకోవాలి.

కటి ప్రదేశంలో ఇలా....

నడుము, కాళ్లు, చేతుల్లో నొప్పులకు ప్రధాన కారణం లంబార్ స్పాండిలోసిస్. వెన్నులోని కీళ్లలో కూడా కొందరికి అరుగుదల మొదలవుతుంది. అలా కాకుండా ఏదైనా ప్రమాదానికి గురైన తర్వాత ఈ సమస్యలు మొదలైతే, అందుకు కండరాలు, వెన్నుపూసల గాయాలు కారణం కావచ్చు. వెన్ను పూసల గాయాలకు సమస్య తీవ్రతను బట్టి మందులు వాడుకోవచ్చు. వ్యాయామాలతో పాటు, భంగిమలను సరి చేసుకోవడం లాంటివి అవసరమవుతాయి. ఇవేవీ ఫలితం చూపించని సందర్భాల్లో, దైనందిన పనులు చేసుకోలేని పరిస్థితుల్లో సర్జరీ కూడా అవసరం పడవచ్చు.

కాలర్లు, బెల్టులు ఎంతకాలం?

సర్వైకల్ (మెడ) స్పాండిలోసిస్, లంబార్ (నడుము) స్పాండిలోసిస్‌లకు కొంత కాలం పాటు కాలర్లు, బెల్టులు వాడవలసిన అవసరం ఉంటుంది. అయితే కొందరు, వైద్యులు సూచించినంత కాలం వాడి, వాటిని మానేయకుండా, నిరంతరంగా వాడుతూ ఉంటారు. ఇది సరి కాదు. ఇలా వాడడం వల్ల ఆయా ప్రదేశాల్లోని కండరాలు బలహీనపడతాయి. వెన్ను ఎముకలు ఫ్రాక్చర్లకు గురైనప్పుడు వీటిని దీర్ఘకాలం పాటు వాడుకోవలసి ఉంటుంది. అయితే తాత్కాలికమైన కండరాల గాయాలకు పరిమిత కాలం పాటు వీటిని వాడుకుంటే సరిపోతుంది.

పరీక్షలు ఇవే!

ఎక్స్‌రేలో ఎముకల గాయాలు, వెన్ను అలైన్‌మెంట్ వివరాలు తెలుస్తాయి. తలకూ, వెన్నుకూ గాయాలైనప్పుడు ఎక్స్‌రేతో పాటు సిటి స్కాన్ చేయించడం తప్పనిసరి. సిటి స్కాన్‌తో ఎక్స్‌రేను మించిన సమాచారం తెలుస్తుంది. అయితే ఎముక చుట్టూరా ఉన్న సున్నితమైన నరాలు, కండరాలు, వెన్ను చుట్టూరా ఉన్న నీరు, జాగాలు లాంటి మృదు కణజాలం గురించిన వివరాలు తెలుసుకోవడం కోసం ఎమ్మారై మీద ఆధారపడక తప్పదు. కొన్ని సందర్భాల్లో మొదట ఎమ్మారై, తర్వాత సిటి స్కాన్ అవసరం పడవచ్చు.

వెన్ను సర్జరీలు సురక్షితం

పూర్వం వెన్ను సర్జరీలు చేసే విధానం భిన్నంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఎన్నో అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎండోస్కోప్స్, మైక్రోస్కోప్స్ వాడకంతో పాటు మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలను నేటి వైద్యులు అనుసరిస్తున్నారు. కాబట్టి పొరపాట్లకు ఆస్కారాలు తక్కువ. సర్జరీ తదనంతరం అవయవాలు బలహీనపడే అవకాశాలు కేవలం ఒక్క శాతమే! అయితే ఈ బలహీనత తాత్కాలికమే! సర్జరీ తదనంతరం వారం నుంచి మూడు వారాలు లేదా గరిష్ఠంగా ఆరు నెలలు ఈ సమస్య ఉండి, ఫిజియోథెరపీతో తగ్గిపోతుంది. సర్జరీలో నాడులకు జరిగే నష్టం వల్ల లేదా సర్జరీకి ముందే నాడికి జరిగిపోయిన నష్టం వల్ల అరుదుగా కొందర్లో బలహీనత శాశ్వతంగా ఉండిపోవచ్చు. అయితే అవకయవాల్లో బలహీనత తాత్కాలికమైనదైనా, శాశ్వతమైనదైనా, అది అందరూ అనుకున్నంత తీవ్రంగా ఉండదు. కాబట్టి అనవసరపు భయాలు వీడి నిర్భయంగా, వెన్ను సర్జరీలను ఆశ్రయించవచ్చు.

# పదవ తరగతి- ఫిజికల్ సైన్స్ ఇలా చదివితే మంచి మార్కులు ఖాయం

## సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు, బాపట్ల జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి



చీరాల, ఫిబ్రవరి 12, ప్రజాపాలన : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలలో, మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ ఏడారి టెన్త్ సైన్స్ పబ్లిక్ పరీక్షను, మరో కొత్త విధానంతో నిర్వహించబోతున్నారు. గతంలో సైన్స్ లో ఉన్న రెండు పేప ర్లను తొలగించి, వంద మార్కుల కి, ఒకే పేపర్లో పరీక్ష నిర్వహిస్తుంది. సమయం 3 గంటల 15నిమిషాలు ఇవ్వడం జరిగింది. ఇందులో మొదటి 15నిమిషాలు, ప్రశ్నాపత్రం చదివి,అర్థం చేసుకోవడానికి కేటాయించ బడింది.గతంలో ఉన్న భౌతిక రసాయన శాస్త్రాలు, పేపర్ -1, జీవశాస్త్ర పేపర్-2 ను కలిపి ఒకే ప్రశ్నా పత్రంలో ఇవ్వబోతున్నారు. ఫిజికల్ సైన్స్ నందు, 16 ప్రశ్నలు 50 మార్కులకు, 17 ప్రశ్నలు జీవశాస్త్రము నుండీ, 50 మార్కులకి ఉంటాయి. వీటిని వేరువేరు సమాధాన పత్రాలలో, వ్రాయవలసి ఉంటుంది. మొదట ఫిజికల్ సైన్స్ (పీ.ఎస్), ఒక సమాధాన పత్రంలో వ్రాయవలసి ఉంటుంది. పరీక్ష మొదలైన ఒక గంట తరువాత, రెండవ సమాధాన పత్రం యిస్తారు. దీనిలో బయెా లాజికల్ సైన్స్(పార్ట్-బి) వ్రాయవలసి ఉంటుంది. విద్యార్థులు తమ సమాధానాలను, వాటికి సంబంధిత సమాధాన పత్రాలతో, మాత్రమే వ్రాయవలసి ఉంటుంది. సమాధానాలను, తగిన సమాధాన పత్రంలో వ్రాయకపోతే, అనవసరంగా మార్కులు కోల్పోతారు. ఈ సమాధాన పత్రాలు, వేరువేరుగా దిద్దుతారని తెలుసుకోండి. ముఖ్యంగా ఈ సారి సైన్స్ పరీక్షనందు, ఎక్కువ సిలబస్ ని దృష్టిలో పెట్టుకొని, అన్నీ అంశాలపై దృష్టి పెట్టడం మంచిది. అలాగే పరీక్ష రాసే సమయ ప్రణాళికపై. కూడా దృష్టి పెట్టక తప్పదు. పరీక్ష రాయవలసిన జవా బుల, నిడివి కూడా చాలా ఎక్కువే మరి. ఈ మార్పుల పై అవగాహన పెంచుకొని, పూర్తి స్థాయి మార్కులు సాధించడానికి మీరు కృషి చేయాలి. విద్యార్థులారా...,!క్రమ పద్ధతిలో చదివితే, ఎప్పుడూ మంచి మార్కులే సాధించవచ్చు. ముఖ్యంగా ఒక మార్కు, 2 మార్కుల విషయంలో, ఎక్కువ శ్రద్ధ పెట్టి, పాఠ్యపుస్తకంలో కీలక భావనలన్నింటిని, మనసులో పెట్టుకొని, పాఠం చివరలో అభ్యసనాన్ని, మెరుగుపరచుకొందాం అనే అంశం ప్రశ్నలన్నింటినీ, చక్కగా చదవాలి. ప్రశ్నలు మొత్తం పాఠ్యపుస్తకంలో నుండి,ఎక్కడి నుంచైనా ఇచ్చే అవకాశం ఉంది. క్రమ పద్దతిలో సొంత రాసుకొని చదివితే, తేలికగా మార్కులు సాధించవచ్చు. ఒక పద్ధతి ప్రకారం శ్రద్ధగా చదువుకుంటే, మంచి మార్కులు సాధిం చడం తేలికే. పరీక్షలో అన్నిపాఠాలకు సమప్రాధాన్యం, ఉంటుందన్న విషయం మరవద్దు.. ఫలానా పాఠం నుండే, ముఖ్యమైన ప్రశ్నలు, టెక్స్ట్ బుక్ లో అడిగిన విధానంలోనే, వస్తాయని ఏమీ ఉండదు. విద్యార్థులు ఎంతవరకు విద్యా ప్రమాణాలు సాధించారో, పరిశీలించేలా ప్రశ్న పత్రాన్ని రూపొందిస్తారు తప్ప, వేరొకటి కాదు.విద్యార్థులు పాఠ్యపుస్తకాన్ని క్షుణంగా చదవాలి. నోటుపుస్తకాన్ని విధిగా నిర్వహించాలి. లెసన్ వారీగా కీలక పదాలు, నూతన పదాలు రాసుకొని, గుర్తుంచుకొని ఉండాలి. ఇవి విషయావగాహనకు, సొంతంగా సమాధానాలు రాయడా నికి, ఉపయోగ పడతాయి. అర్థంకాని భావనలను,ఉపాధ్యాయులను స్వయంగా అడిగి, తెలుసు కోవాలి. గ్రహించిన విషయాల ను, మీ తోటి విద్యార్థులతో చర్చించాలి. అప్పుడే మీరు నేర్చుకోవడం లో ఉండే,మజా పొందుతారు.

**ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది?**

ఒక మార్కు ప్రశ్నలు-6, రెండు మార్కుల ప్రశ్నలు-4,నాలుగు మార్కుల ప్రశ్నలు-3, ఎనిమిది మార్కుల ప్రశ్నలు-3(ఇంటర్నల్ ఛాయిస్ తో), వ్యాసరూప ప్రశ్నలకు మాత్రమేఅంతర్గత ఎంపిక ఉంటుంది. వీటికి 24 మార్కులు ఉంటాయి. అంటే 48 శాతం మార్కులు ఈ సెక్షన్ నందు ఉంటాయి. ఈవ్యాసరూపప్రశ్నల్లో ముఖ్యంగా విషయావగాహన, పట్టికల్ని వ్యాఖ్యానించడం ప్రయోగశాల కృత్యాలు, బొమ్మలు గీయడం ఇలాం టి వాటి పై ప్రశ్నలు ఉంటాయి. ప్రయోగశాల కృత్యాలలో, భౌతిక మరియు రసాయన శాస్త్రాల మధ్య, అంతర్గత ఎంపిక ఉంటుంది.

**రాత బాగుండాలి**

రాత మార్చుకొంటే, నీ తలరాత మారుతుంది. గుండ్రటి మీ చేతివ్రాతతో, మీ ఆత్మ విశ్వాసం మరింత బలోపేతం అవుతుంది. రాత బాగుం టే, ఫుల్ మార్కు ఖాయం.దాని మీద దృష్టి పెట్టాలి. పరీక్షలు మీ ఆలోచ నలు , భావాలు వ్యక్తం చేయడానికే , సొంతంగా రాసే అలవాటు చేసుకోవాలి. విశ్లేషణ చేస్తూ ,సృజనాత్మక ఆలోచనల తో చదవాలి తప్ప బట్టీ పట్టి పరీక్షల్లో, రాసేసి మమ అనిపిస్తే, భవిష్యత్ అవసరాలకు, మీ చదువు అక్కరకు రాక, అవస్థలు పడతారు. మిమ్మల్ని మీరు అంచనా వేసేందుకు, మరిన్ని సార్లు రాయండి. రాత బాగుపడు తుంది. దీని తో పాటూ, జ్ఞానాన్ని చిరకాలం గుర్తుకు పెట్టుకొని, అవసరం ఉన్నపుడు వినియోగించు కోవచ్చు. సిలబస్ ని బట్టి, భౌతిక, రసాయన శాస్త్రం లో మొత్తం 12 అధ్యాయాలు ఉన్నాయి. అవి.. ఉష్ణం, ఆమ్లాలు-క్షారాలు -లవణాలు, సమతల ఉపరితలాల వద్ద, కాంతి వక్రీభవనం, వక్ర తలాల వద్ద, కాంతి వక్రీభవనం, మానవుని కన్ను-రంగుల ప్రపంచం, పరమాణు నిర్మాణం, మూల కాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, రసా యన బంధం, విద్యుత్ ప్రవాహం, విద్యుదయస్కాంతత్వం, లోహ సంగ్రహణ శాస్త్రం, కార్బన్ దాని సమ్మేళనాలు. పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రం రూపకల్పన లోనూ, మార్పులు చోటుచేసుకున్నాయి. కనుక వాటి కనుగుణంగా మీ ప్రిపరేషన్ కొనసాగించండి. ప్రశ్నల రకాల్లో మార్పు లేకపోయినా, ప్రశ్నించే విధానంలో మార్పు ఉంటుంది. విద్యా ప్రమాణాలు 1. విషయావగాహన, 2. ప్రశ్నిం చడం పరికల్పన చేయడం., 3. ప్రయోగాలు క్షేత్ర పర్యటనలు, 4. సమాచార నైపుణ్యా లు, ప్రాజెక్ట్ పనులు,5. బొమ్మలు గీయడం ద్వారా భావ ప్రసారం, 6.ప్రశంస, జీవ వైవిధ్యం మరియు నిజ జీవిత వినియోగం, ఈ విద్యా ప్రమా ణాల ఆధారంగా, ప్రశ్నాపత్రం ఉంటుంది. ఖచ్చితంగా ఒక అధ్యాయానికి, ఇంత భారత్వం (వెయిటేజీ) అనేది లేదేలేదు. ఏ ఆధ్యాయం నుంచైనా. ఎన్ని ప్రశ్నలైనా రావచ్చు. వాటిని ఏ రూపంలో నైనా అడగవచ్చు. అందువల్ల విద్యా ప్రమాణాల వారీగా, ప్రశ్నల రకం ప్రకారం విస్తృతంగా చదవండి. పాఠ్య పుస్తకం చివర ఉన్న 'అభ్యస నాన్ని మెరుగుపరచు కొందాం 'లోని, ప్రశ్నల సాధన ఎంతో ముఖ్యమని,ప్రశ్నల్లో ఎక్కువగా భేదాలు రాయుడం,ఉదాహారణ లతో వివరించడం, గణనలకు సంబంధించిన ప్రశ్నలు, కారణ సంబంధ ఫలితాలు తెలపడం, ఇచ్చి న పట్టికలో వివరాల ఆధారంగా ప్రశ్నలు, ప్రయోగ కృత్యాలు మొదలైన అంశాలకు సంబంధించి ఉంటాయి.రెండు మార్కుల ప్రశ్నలకు, 4-5 వాక్యాలలో సమాధా -నాలు రాయాలి. ఈ ప్రశ్నలకు 1 నుంచి 2 వాక్యాల్లో జవాబులు రాయాలి. ఈ ప్రశ్నల్లో, కొన్ని నిర్వచనాలు, విలువ లు, ఉదాహారణలు ఉండే అవకాశం ఉంది.ఒక్కో వాక్యానికి, అర మార్కు చొప్పున కేటాయిస్తారు. రెండు చిన్న ప్రశ్నలు కలిపి, ఒక ప్రశ్నగా ఇచ్చినప్పుడు,దానికి జవాబు రాయగలిగితే, పూర్తి స్థాయిలో మార్కులు వచ్చే అవకాశముంది. అవసరమైన చోట పటాలను గీస్తే మంచిది.ప్రశ్నలు పరోక్షంగా అడిగే అవకాశముంది.

## గురుకుల పాఠశాలలో ఆరో ప్లాంట్‌ను పరిశీలించి త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్



పల్నాడు జిల్లా .నరసరావుపేట. ఫిబ్రవరి 12 (ప్రజాపాలన ప్రతినిధి ): జిల్లా కలెక్టర్ శివ శంకర్ లో తేటి ఆదివారం సత్తెనపల్లి రామకృష్ణాపురంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గత నెల 30 వ తారీఖున కలుషిత ఆహారంతో 210 మంది పిల్లలు అస్వస్థకు గురై చికిత్స అనంతరం తిరిగి పాఠశాలలో చేరుతున్నారు. వంటశాలను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా వివరాలు సేకరించారు. ఆరోవో ప్లాంట్ ను పరిశీలించి త్వరితగతిన మరమ్మత్తులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో కూర్చొని సహపంక్తి భోజనం చేస్తూ పలు విషయాలను కోలంకుషంగా చర్చించారు. పిల్లలందరూ బాగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహిస్తుంటారా వాటిలో పాల్గొంటున్నారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ముచ్చటిస్తూ వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భోజనం అనంతరం పిల్లల లో ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా పాఠ్యాంశాలు బోధించి పలు ప్రశ్నలకు సమాధానం రాబట్టే ప్రయత్నం చేశారు. అదేవిధంగా పలు పాఠ్యాంశాలను చదివించారు. అనంతరం గురుకుల పాఠశాల వసతి సముదాయానికి ఎదురుగా ఉన్న బాల భవనలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తదుపరి పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ గ్రూఫ్ చైర్మన్ కటికల శివభాగ్య రావు జన్మదిన వేడుకలు



విజయవాడ 12 ఫిబ్రవరి ప్రజా పాలన : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి మరియు మాస్టర్ కి టీవీ ఆధ్వర్యంలో విజయవాడ మాస్టర్ కి టీవీ ఆఫీస్ లో పార్స్ సిడబ్ల్యూసి మెంబర్ డాక్టర్ చందు అధ్యక్షతన జరిగినది.ముందుగా డాక్టర్ కటికల.శివ భాగ్య రావుగారుకేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరూ పూలదండలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార సమితి సి డబ్ల్యూ సి లీగల్, పార్స్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఎం రామదాసు, రిటైర్డ్ జిల్లా జడ్జి బి వినయ్ కుమార్, మాస్టర్ కి టీవీ ఛానల్ మాస్టర్ ఏపీ ఇంఛార్జి గురజాల శ్రీనివాస్,పార్స్ స్టేట్ అడ్వకేట్స్ ఇంచార్జ్ వై న్యూటన్, కుసుమ భోగరాజు సోషల్ యాక్టివిస్ట్ , విజయవాడ పార్స్ ఆఫీస్ దాత దాసరి కేశవులు, స్టేట్ కోఆర్డినేటర్ నమ్మి అప్పారావు యాదవ్, స్టేట్ కోఆర్డినేటర్ కటికల రవికుమార్ , స్టేట్ కోఆర్డినేటర్ అడ్వకేట్ డి కే వి ప్రకాష్, డాక్టర్ కందుల చందు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సి డబ్ల్యూ సి మెంబర్, అడ్వకేట్ ఆర్ బాలు, అడ్వకేట్ జయ ప్రకాష్ , అడ్వకేట్ సాంబిరెడ్డి, పీవీవీ సత్యనారాయణ హై కోర్ట్ అడ్వకేట్, ఏ ప్రవీణ్ కుమార్ అడ్వకేట్ బి బి ఏ, వేముల ప్రసాద్ హై కోర్టు అడ్వకేట్, అడ్వకేట్ వి నాగరాజు ఏ పి హెచ్ సి ఆల్ డిస్టిక్ కోర్ట్స్, , పార్స్ యువ నాయకులు అనిల్,అంజనీ,వెంకటప్పయ్య,అప్పాజీ, కిరణ్,రవి తదితరులు పాల్గొన్నారు.



## పేకాట శిబిరంపై పోలీసులు దాడి



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి. :జగ్గంపేట గ్రామ శివారున వున్నా లారీ యూనియన్ ఆఫీస్ వెనుక రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట ఎస్సై గారికి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై విద్యాసాగర్ గారు తమ సిబ్బందితో లారీ యూనియన్ ఆఫీస్ పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 7వేల 200 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో పట్టుబడ్డ పేకాట రాయులను రేపు కోర్టులో హాజరు పరుస్తామని తెలియజేశారు.

## శివ నాగేంద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్

నందిగామ ఫిబ్రవరి 12 ప్రజా పాలన ప్రతినిధి: పట్ట ణంలోని 9 వ



వార్డు కృష్ణబలజీ నగర్ లో శివ నాగేం ద్ర స్వామిని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కు మార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం దే వాలయ కమిటీ సభ్యులుఆయనను శాలువాతో స త్కరించారు అనంతరంవీసం సత్య నారాయణ కు మారుడి వివాహ వేడుకలో పాల్గొని, నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ ఫిబ్రవరి 12 ప్రజాపాలన ప్రతినిధి పట్టణం లో



కుమారస్వామి నగర్ నందు నూతనంగా గృహ ని ర్మాణం చేసుకున్న పవన్ సాయి నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య నూతన గృహాన్ని సందర్శించి పవ న్ సాయి హేమ శ్రీ దంపతులకు శుభాకాంక్షలు తెలి యజేశారు.

## కరాటే పోటీలలో సందీప్ స్కూల్ విద్యార్థుల విశేష ప్రతిభ

చీరాల, ఫిబ్రవరి 12, ప్రజాపాలన : జపాన్ కరాటే అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో, ఒంగోలులోని పేస్ స్కూల్ లో, జరిగిన ఇంటర్



డిస్ట్రిక్ట్ లెవెల్ కరాటే టోర్నమెంట్ లో, చీరాల సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి, బహుమతులు గెలుచుకు న్నారు. ఈ టోర్నమెంట్లో, సీనియర్స్ విభాగములో చీరాలలోని సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన, ఆర్.సాహితి మొదటి బహు మతిని, సిహెచ్ పూజిత రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు.జూనియర్స్ విభాగంలో సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన ఏ.వసంత రెండవ ప్లేస్ ను కైవసం చేసుకున్నది. బహుమతులు పొందిన విజేతలను, అలాగే కరాటే మాస్టర్ నక్కల శివప్రసాద్ ను, సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యవస్థాపకులైన డాక్టర్.టి. వెంకటేశ్వర్లు(టీ.వీ)సార్ అభినందించి, వారి కృషి ని ప్రశంసించారు. నేటి పరిస్థితుల దృష్ట్యా, మహిళలు ఆత్మరక్షణ విద్యలు, ఖచ్చితంగా నేర్చుకోవాలని, దానిని బాల్య దశ నుండి అభ్యసిస్తున్న విద్యార్థులను కొనియాడారు.

## నరసరావుపేట టౌన్ వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కో కన్వీనర్ గా భాష సయ్యద్



పల్నాడు జిల్లా. నరసరావుపేట.. ఫిబ్రవరి 12 (ప్రజాపాలన ప్రతినిధి) నరసరావుపేట టౌన్ వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కోకనవాడిగా సయ్యద్ భాషను నియమించడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నూతనంగా కూకనేవాడిగా బాధ్యతలు చేపట్టిన సయ్యద్ భాష కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా భాష మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా నమ్మకంగా ఉంటూ పార్టీ కార్యకలాపాలకు మందుండి నడిపిస్తూ , నరసరావుపేట శాసనసభ్యులు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో చురుకుగా పనిచేస్తూ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ ఉన్నందుకు ఈ పదవి ఇచ్చారని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,కి నరసరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఏ. అనీఫ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## బాహుబలి (రాజస్థాన్) ఎద్దులపై సవారి చేసిన జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి.: కాకినాడ జిల్లా జగ్గంపేట ఫిబ్రవరి 12: ఈనెల 15, 16 తేదీల్లో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జగ్గంపేట నియోజకవర్గ పర్యటన ఖరారైన నేపథ్యంలో అనేక ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా జగ్గంపేట మండలం తెలుగు రైతు ఉపాధ్యక్షులు కురుమళ్ళ నాగేశ్వరరావు రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బాహుబలి ఎద్దులతో బండిని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించి చంద్రబాబు పర్యటనలో ఉపయోగిస్తామన్నారు. అందులో భాగంగా ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ ఎద్దులతో బండి ఏర్పాటు చేసి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఎద్దుల బండి పై సవారి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, మండల రైతు ఉపాధ్యక్షులు కురుమళ్ళ నాగేశ్వరరావు, ఉంగరాల గణేష్, కుదపవాసు, రాయి సాయి, మండపాక అప్పన్న దొర, షేక్ వల్లి, నల్లమాటి ఆనంద్ అడపా తాతాజీ, నవనాసి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థానీ వలసలకు అలాగే యాజకులకు భోజనం ప్యాకెట్స్ పంపిణీ చేసిన క్యాండిల్ యూత్ వాలంటీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి :కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామ పరిసరాల్లో రాజస్థాన్ వలస కార్మికులు అలాగే సెంటర్లో బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న కొంతమంది నిరశ్రాయులకు మా స్నేహితుడు సజ్జ రమేష్ పుట్టినరోజు సందర్భంగా 60 మందికి భోజనం ప్యాకెట్స్ క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈరోజుల్లో అనేకమంది పుట్టినరోజులను హొటల్స్ లోను,రకరకాలుగా ఎక్కడెక్కడో పార్టీలు అనే పేరుతో ఎంతో కొంత సొమ్మును అనవసర ఖర్చులు చేసుకుంటూ వారి తాత్కాలిక సరదాలను అనుభవిస్తున్నారు. నేను ప్రతి సంవత్సరం కూడా ఇలానే కొంతమందికి వారి ఆకలితో అలమటిస్తూ ఉన్నవారికి వారి ఆకలినైనా తీర్చాలి అనవసరమైన ఖర్చులు మానుకొని కొంతమంది కి ఆకలి తీర్చాలని అనే ఆలోచనతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి నా స్నేహితుడు క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు ద్వారా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ,ఆనందాన్ని ఇచ్చిందని ఇలాగే ప్రతి ఒక్కరూ తమ సేవాతాత్పర్యాన్ని అలవర్చుకోవాలని భావిస్తున్నాను. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జనరల్ హాస్పిటల్ లో ఐ కేర్ ఆప్తలిస్ట్ టీ. కరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆల గోపాలకృష్ణ సాయి నిర్వహించిన పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్సీ మొండితోక అ రుణ్ కుమార్



చందర్లపాడు ఫిబ్రవరి 12 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆల ప్రభు మరియు ఆయన కుమారుడు ఆల గోపాలకృష్ణ సాయి ఆధ్వర్యంలో లక్ష్మీపురం నుండి పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుప త మ్మ గోపయ్య స్వామి దేవస్థానం వరకు (ఎమ్మెల్యే డా క్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో నందిగామ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందా లని – ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావుకి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని) నిర్వహించి న పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో శాసనమండ లి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, జగ్గ య్యపేట శాసనసభ్యులు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పాల్గొని వారికి కృతజ్ఞతలు తెలిపి, అభి నందించారు .. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల మరి యు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రా వు పట్ల ఆధరాభిమానాలు చూపిస్తున్న లక్ష్మీపురం పార్టీ నాయకులకు ఆల ప్రభుకి ధన్యవాదాలు తెలి పారుఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పా ర్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భరతమాత ముద్దు బిడ్డ నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపిన విశ్వకర్మ సంఘీయులు..



పల్నాడు జిల్లా. నరసరావుపేట .ఫిబ్రవరి 12 (ప్రజా పాలన ప్రతినిధి) పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో బిజెపి ఆర్టిజెన్ సెల్ జిల్లా కన్వీనర్ మరియు విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సిద్దు అనంత నాగ బ్రహ్మాచారి ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ లో విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకం ను ప్రవేశపెట్టిన కారణంగా గౌరవ భారత ప్రధాని నరేంద్రమోదీ కి కృతజ్ఞతలు తెలుపుతూ విశ్వకర్మ సంఘీయుల ఆత్మీయ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న బిజెపి నరసరావుపేట అసెంబ్లీ ఇంచార్జి రంగిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 140 పేర్లతో పిలవబడుతున్న విశ్వకర్మ సంఘీయులను సోదరభావంతో గుర్తించి సృష్టి,ప్రతి సృష్టి చేయగలిగిన విశ్వకర్మ లకు ఆర్థిక,పారిశ్రామిక లబ్ది చేకూరేలా వారికి పి.ఎమ్.విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకం చ ను ప్రవేశపెట్టి వాటిని %మీవీజు% తో వాల్యూచైన్ అనుసంధానం చేయటం వలన విశ్వకర్మ సంఘీయుల ఆర్థిక, సామాజిక పురోగతికి తోడ్పడుతుంది అని తెలిపారు.కార్యక్రమ నిర్వాహకులు సిద్దు అనంత నాగ బ్రహ్మాచారి మాట్లాడుతూ గౌరవ భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం లోని కేంద్రప్రభుత్వం విశ్వకర్మ ల ఆర్థిక పురోగతికి వెన్నుదన్నుగా నిలుస్తుందని ఈ కారణంగా విశ్వకర్మ సంఘీయులు నరేంద్రమోదీ గారికి ధన్యవాదాలు తెలుపుతూ నరసరావుపేట పట్టణములో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ అధ్యక్షులు చంద్ర పాటి చెంచు సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయి, విశ్వ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుట్ల శివాచారి, యలవర్తి నాగాచారి, బొమ్మిడాకుల సైదాచారి,తొండపి సాంబశివాచారి,శ్రీ సత్తెనపల్లి చంద్రశేఖరాచారి,ఎస్. బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడి కస్తూర్బా పాఠశాలలలో విద్యార్థునిలకు నరకం చూపిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన




కారంపూడి... ఫిబ్రవరి12 ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలో నీ కస్తూర్బా పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులతో బాత్రూములు శుభ్రం చేయిస్తున్నారని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు తమ బాధను తల్లితండ్రులతో పంచుకోవటానికి భయపడుతున్న విద్యార్థినులు దుర్వాసన భరించలేక కళ్ళు తిరిగి పడిపోయిన ఇద్దరు చిన్నారులుఆ బాధను తల్లితండ్రులకు చెప్పుకోలేక పాఠశాల మానివేస్తామని బోరున విలపిస్తున్న విద్యార్థినులు పాఠశాల ఆవరణలో విద్యార్థినీలతో శుభ్రం చేయిస్తున్న సిబ్బంది పాఠశాల లో జరిగిన విషయాలు తల్లితండ్రులతో చెబితే విద్యర్దినులను కొడుతున్న టీచర్లు .విద్యార్థినుల సమాచారం సైతం తల్లితండ్రులకు ఇవ్వని టీచర్లు .ఏ విషయం గురించి ఐన తల్లితండ్రులు , టీచర్లను అడిగితే వారి పిల్లలను కొడుతున్నారని ఆవేదనచెందుతున్నతల్లితండ్రులు .అనారోగ్య సమస్యతో ఉన్న పిల్లలను తినకూడని కూర తినే వరకు కొడుతున్నారని తెలుపుతున్న విద్యార్దినులు ఇక్కడ జరిగే విషయాలు మీరు ఎందుకు బయట చెప్తున్నారు అని మళ్లీ మమ్మల్ని మందలించి కొడతారని విద్యార్థులు భయపడుతున్నారు .తమను కొడుతున్నారని విలేకరులకు తెలిపిన విద్యార్థినులు .అల్లరి చేసిన విద్యార్థినుల నుండి డబ్బులు వాసులు చేస్తున్నారని తెలిపిన విద్యార్థినులు, ఆ డబ్బులతో చీపురులు కొంటున్నట్లు తెలిపినవిద్యార్థినులు .ఆదివారం పాఠశాలకు వచ్చిన తల్లితండ్రులతో కలిసి తమా బాధను విలేకరులతో పంచుకున్న చిన్నారులు .

## రానున్నది తెదేపా ప్రభుత్వం..: పొత్తూరి



నరసాపురం, ఫిబ్రవరి 12 (ప్రజాపాలన ప్రతినిధి) :వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పరిపాలనను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆదివారం నరసాపురం మండలం మల్లవరం గ్రామంలో ఇదేంఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక ఎస్సీ, బీసీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. గత మూడున్నర సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలి అసమర్థ పరిపాలన చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి అధికారం చేపట్టనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వరరావు, గ్రామ సర్పంచ్, ఎస్సి సెల్ అధ్యక్షుడు సంధి నరసింహారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, నాయకులు కొక్కిరిగడ్డ వెంకటరత్నం, పిల్లి జయరాజు, పిట్టా సూర్య ప్రకాష్, చింతపల్లి కృష్ణ, గూడూరి నాగరాజు, ఆకుమర్తి నాగరాజు, ఆకుమర్తి లాల్, నెక్కట్టి వెంకట్రావు, కందికట్ల రాజశేఖర్, కేతా శ్రీను, బొక్కా దుర్గారావు, గూడూరు బద్రి, దేశమరాజు, వెంకటేశ్వరరావు భారతల మాణిక్యం, నవుడూరి నారాయణరావు, ఆకుమర్తి శ్రీను, బొక్కా వీరబాబు, గూడూరి రామకృష్ణ, పిల్లి అజయ్ బాబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదారమ్మ శిగలో మరో ఆణిముత్యం మొల్ల విగ్రహం



కొవ్వూరు ప్రజాపాలన ప్రతినిధి: తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి,సాహిత్యానికి పెట్టింది పేరైన రాజమహేంద్రవరం గోదావరమ్మ శిగలో మరో ఆణిముత్యం చేరిందని, అదే తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల విగ్రహమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని గౌతమీ ఘాట్ వద్ద వాకర్స్, యోగా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో తొలి తెలుగు కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర హెూం మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన శ్రీమద్రామయణాన్ని ఆధారంగా చేసుకొని తేట తెలుగులో పద్య కావ్యంలో మొల్ల రచించారని, ఆ కావ్యమే మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. కంద పద్యాలు ఎక్కువగా ఉండటం వల్ల కంద రామాయణం అని కూడా అంటారని చెప్పారు. కేవలం అయిదు రోజుల్లో ఈ కావ్యాన్ని రాసినట్టు చెబుతారని, మొల్ల రచన వాడుక భాషకు దగ్గరగా ఉండటం వల్ల ప్రజలకు అత్యంత చేరువైన కావ్యం మొల్ల రామాయణం అని ఎంపీ భరత్ వివరించారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల కవితలల్లిన తొలి తెలుగు

## పొన్నూరు ఫాతిమా వైద్యశాలలో వైద్యం వికటించి బాలిక మృతి



పొన్నూరు ఫిబ్రవరి12 (ప్రజాపాలన ప్రతినిధి) :గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం కూరగాయల మార్కెట్ ప్రక్కన ఉన్న ఫాతిమా వైద్యశాలలో వైద్యం వికటించి 14 సంవత్సరాల బాలిక మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పిట్లవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన షేక్ అఖిల్ కుమార్తె సహిస్తా(14) కు గత రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో పొన్నూరులోని ఫాతిమా వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకొని వెళ్ళింది. జ్వరం తగ్గకపోవడంతో మరల గత రాత్రి శనివారం తల్లిదండ్రులు సహిస్తా ను వైద్యశాలకు తీసుకువచ్చారు.డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో కాంపౌండర్ ఇంజక్షన్ ఇవ్వటంతో సహస్తా అక్కడికక్కడే కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందింది. ఘటనకు నిర్గాంత పోయిన తల్లిదండ్రులు, బంధువులు ఒక్కసారిగా గుండెలు పగిలేలా రోదించారు. విషయాన్ని తన బంధువులకు సమాచారం ఇవ్వగా ఫాతిమా వైద్యశాలకు చేరుకున్న బంధువులు కోపోద్రేకులై వైద్యశాలపై దాడికి దిగడంతో పాటు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఘటనతో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించి పోయింది. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ బాబి, పోలీస్ సిబ్బందితో రంగ ప్రవేశం చేసి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులైన బాధితుల ను శాంతింపజేశారు. ఫాతిమా వైద్యశాల డాక్టర్ నూరుల్లా హుదా ను పిలిపించి బాధితులను, స్థానిక పెద్దల సమక్షంలో ఎటువంటి కేసులు లేకుండా రాజీ చేసి సెటిల్మెంట్ చేసినట్లు సమాచారం. మృతి చెందిన సహస్తా ఏడవ తరగతి చదువుతున్నట్లు సమాచారం . నిండు ప్రాణాన్ని బలిగొన్న వైద్యశాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా దగ్గర ఉండి సెటిల్మెంట్ చేసిన వారిని ఆ దేవుడు క్షమిస్తాడా!.. అని పట్టణంలో బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ వైద్యశాలపై ఇటువంటి సంఘటనలు జరిగిన బయటకి పొక్కకుండా సెటిల్మెంట్ లు చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలానే పొన్నూరు పట్టణం లోని కొన్ని వైద్యశాలలో ఇలాంటి సంఘటనలు జరిగిన కేసులు, వగైరా లేకుండా డబ్బులతో ప్రాణాన్ని కొంటున్న డాక్టర్ల వైనం పై ప్రజలు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వాడ ప్రవీణ్ ను సన్మానించిన వజ్జల వెంకట సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి ప్రజాపాలన ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే ముని రామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్ తెలుగుదేశం పార్టీలో చేరడం మనకు తెలిసిన విషయమే. తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి ఇన్చార్జి వజ్జల వెంకట సుధీర్ రెడ్డి వాడ ప్రవీణ్ ను దృశ్యాలతో సన్మానించడం జరిగింది. బొజ్జల సుధీర్ రెడ్డి యువ గళం పాదయాత్ర సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రవేశిస్తున్న నారా లోకేష్ పాదయాత్రకు అన్ని సహాయ సహకారాలు తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అందరూ పాల్గొని పాదయాత్రను దిగ్విజయంగా కొనసాగించాలని బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## అంతిమ సంస్కారాల కొరకు శివానంద ధామం




రేణిగుంట ప్రజాపాలన ప్రతినిధి: రేణిగుంట మండలం మాండవ్య మహర్షి పురం గాజులమండెం దగ్గర స్వర్ణముఖి నది తీరాన దయనీయమైన మానవతా దృక్పథంతో ఎమ్మెల్యే బీఎఫ్ మధుసూదన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అంతిమ సంస్కారాల కొరకు శివానంద ధామం ను ఏర్పాటు చేసి దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బియ్యపు మధుసూదన్ రెడ్డి గారి కుమార్తె పవిత్ర రెడ్డి రేణిగుంట మండల వైసిపి నాయకులు మరియు రేణిగుంట సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి రేణిగుంట యువత కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.



## పాత దర్శకుడుతో నారా రోహిత్ మరో ప్రయోగం!

నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు కొడుకుగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చినప్పటికీ తనకంటూ ప్రత్యేక గుర్తింపుని ఏర్పరుచుకున్నాడు నారా రోహిత్. బాణం చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన అతడు సోలో చిత్రంతో మంచి హిట్టందుకున్నాడు.ప్రతినిధి రౌడీ ఫెలో అసురవంటి ప్రయోగాత్మక చిత్రాలతో విలక్షణ హీరో పేరు చేసుకున్నాడు. ఒకానొక సమయంలో వరుస సినిమాలను లైన్ లో పెట్టి జోరు చూపించాడు. అంతేకాదు మినిమం గ్యారంటీ హీరో అని కూడా దర్శక నిర్మాతలకి గట్టి నమ్మకం ఉండేది.అయితే అనుకోని విధంగా తుంటరి సావిత్రి రాజా చెయ్యివేస్తే వంటి చిత్రాలు పరాజయం చెందడంతో ఒక్కసారిగా డౌన్ అయిపోయాడు. ఆ మధ్యలో వచ్చిన జ్యో అచ్యుతానంద అప్పట్లో ఒకడుండేవాడు శమంతకమణి వంటి చిత్రాలు పర్వాలేదనిపించినా.. ఆ చిత్రాల్లో వేరే హీరోలుండడంతో రోహిత్ కు ఫుల్ క్రెడిట్ దక్కలేదు. అయినా కథలో రాజకుమారి ఆటగాళ్ళు వీర భోగ వసంత రాయలు వంటి చిత్రాలు చేసినా అవి కూడా డిజాస్టర్లుగా మిగిలాయి. దీంతో అతని మార్కెట్ బాగా దెబ్బతింది.హీరోగా ఎంట్రీ ఇచ్చి చేతి నిండా సినిమాలతో ఎప్పుడూ బిజీగా ఉండే నారా రోహిత్ కొత్త సినిమాలు ఏమి ఒప్పుకోకుండా కెరీర్ కి బ్రేక్ ఇచ్చుకున్నాడు . చాలా కాలం నుంచి అతడి నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు.అయితే మధ్యలో బాణం దర్శకుడు చైతన్య దంతులూరి తో అనగనగా దక్షిణాది అనే చిత్రాన్ని అనౌన్స్ చేసినా అది ఆగిపోయింది. శబ్దం అనే మరో సినిమా కూడా ప్రకటించారు. అది శబ్దం లేకుండా పోయింది. సెకండ్ ఇన్నింగ్స్ గట్టిగా ఉండాలి అని ఏది పడితే అది ఒప్పుకోకుండా మంచి కంటెంట్ ఉన్న మూవీ తో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చెయ్యాలి అని బ్రేక్ ఇచ్చుకున్నాడు . ఈ క్రమంలోనే మళ్లీ రోహిత్ గురించి మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. అదేంటంటే బాణం సినిమా దర్శకుడుతో మళ్ళీ సినిమా చేయబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి కొత్త కథతో సినిమా తరకెక్కిస్తున్నారా లేదంటే ఆగిపోయిన సినిమానే మళ్లీ పెట్టాలికిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం వీరిద్దరి మధ్య చర్చలు జరుగుతున్నాయట. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## "ఎన్టీఆర్30" ఆరోజుకి సిద్ధం.?

ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలు ఉన్న చిత్రాల్లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటించనున్న సాలిడ్ మాస్ చిత్రం కూడా ఒకటి. ఎన్టీఆర్ కెరీర్ లో 30వ సినిమాగా దర్శకుడు కొరటాల శివతో ఈ సినిమా వాటర్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కించనున్నారు. మరి జస్ట్ అనౌన్సమెంట్ లోనే సెన్సేషనల్ హైప్ ని సెట్ చేసుకున్న ఈ చిత్రం ఎప్పుడెప్పుడు షూటింగ్ ని స్టార్ట్ చేసుకుంటుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఇక ఇది అలా అందని ద్రాక్ష లానే వస్తుండగా ఇప్పుడు ఫైనల్ గా ఈ షూట్ కి డేట్ ఫైనల్ అయ్యినట్టుగా తెలుస్తుంది. గత కొన్ని రోజులు కితమే మేకర్స్ అనౌన్స్ చేసినట్టుగా ఫిబ్రవరిలోనే సినిమా స్టార్ట్ అవుతుందట. మరి ఇది ఈ ఫిబ్రవరి 23 నుంచి స్టార్ట్ కానున్నట్టుగా తెలుస్తుంది. మరి దీనిపై ఇంకా అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ మరియు యువసుధ ఆర్ట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.




## డిజిటల్ స్ట్రీమింగ్ కి రెడీ అవుతున్న మైఖేల్

సందీప్ కిషన్ హీరోగా పవర్ ఫుల్ మాఫియా కథాంశంతో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి వచ్చిన చిత్రం మైఖేల్. సందీప్ జయకోడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గత వారం రిలీజ్ అయ్యింది. మాఫియా బ్యాక్ డ్రాప్ కథ కావడంతో పాటు ఆ తరహా జోనర్ కి ప్రస్తుతం మంచి సక్సెస్ ఉండటంతో మైఖేల్ మూవీపైన కూడా భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమా కచ్చితంగా తనకి మంచి సక్సెస్ ఇస్తుంది అనే సందీప్ కిషన్ కూడా బలంగా నమ్మాడు.నటుడిగా తనను తాను ఎలా చూసుకోవాలని అనుకున్నానో అలాంటి పాత్ర మైఖేల్ లో చేసే అవకాశం వచ్చిందని చెప్పాడు. కచ్చితంగా మైఖేల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది అని ప్రమోషన్స్ లో చెప్పారు. అలాగే సందీప్ కిషన్ కెరియర్ లో భారీ హైప్ తో ఈ మూవీ థియేటర్స్ లోకి వచ్చింది. ఊహించని విధంగా డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమాలో ప్లాట్ బాగానే ఉన్న దానిని డీల్ చేయడంలో దర్శకుడు ఫెయిల్యూర్ ఉందనే మాట వినిపిస్తుంది.అలా టాలీవుడ్ లో భారీ అంచనాల మధ్య వచ్చి డిజాస్టర్ మూవీగా మారిన మైకేల్ తో మళ్ళీ సందీప్ కి నిరాశ తప్పలేదు. ఇదిలా ఉంటే ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ కి ఇప్పుడు రెడీ అవుతుందనే మాట వినిపిస్తుంది. మైఖేల్ ఓటీటీ రైట్స్ ని ఆహా సొంతం చేసుకుంది. ఈ మూవీని కాస్తా ఆలస్యంగానే ఓటీటీ లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. అయితే మూవీకి డిజాస్టర్ టాక్ రావడంతో థియేటర్స్ అన్ని కూడా ఖాళీ అయిపోయాయి. దీంతో ఇప్పుడు మూడో వారంలోనే ఓటీటీలో రిలీజ్ చేయడానికిరెడీ అవుతున్నట్లుగా తెలుస్తుంది. ఫిబ్రవరి నెల ఆఖరులో మూవీ ఆహాలో స్ట్రీమింగ్ అయ్యే అవకా శాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇక మైఖేల్ డిజాస్టర్ కావడంతో సందీప్ కిషన్ నుంచి నెక్స్ట్ తెలుగులో రాబోతున్న మూవీ ఊరిపేరు భైరవకొనపై హోప్స్ పెట్టుకున్నారు. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ కథతో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో ఆ మూవీ రాబోతూ ఉండటం కచ్చితంగా ఆకట్టుకుంటుంది అని భావిస్తున్నారు.




## సార్ తర్వాత వెంకి అట్లూరి చేయబోయే చిత్రం ఏంటంటే?

టాలెంటెడ్ దర్శకుడిగా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని సొంతం చేసుకున్న వ్యక్తి వెంకి అట్లూరి. వరుణ్ తేజ్ తో తొలిప్రేమ అనే సినిమా చేసి హిట్ కొట్టిన వెంకి తరువాత మిస్టర్ మజ్ను అనే సినిమా చేశాడు. ఈ మూవీ పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. తరువాత నితిన్ తో రంగ్ దే అనే సినిమా చేశాడు.ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. అయితే ఈ మూడు సినిమాలలో కామన్ పాయింట్ లండన్. ఫస్ట్ హాఫ్ ఇండియాలో సెకండ్ హాఫ్ లండన్ లో తీయడం అతనికి అలవాటుగా మారిపోయింది. అలాగే ఒకే తరహాలో స్టోరీ నేరేషన్ ఉంటుంది అనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిగా పద్ధతి మార్చేసిన వెంకి ఏకంగా సోషల్ ఎలిమెంట్ ని తీసుకొని కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తో సార్ సినిమా చేస్తున్నాడు. కార్పోరేట్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ని ఈ సినిమాలో వెంకి అట్లూరి ప్రశ్నిస్తున్నారు. అందులో ఉండే లోటుపాట్లు గురించి చెబుతున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమా ఫిబ్రవరి 17న ప్రేక్షకుల ముందుకి రాబోతుంది. ఇదిలా ఉంటే ఈ మూవీలో ధనుష్ నటిస్తూ ఉండటంతో కాస్తా బజ్ అయితే ఉంది. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత వెంకి అట్లూరి మరోసారి అలాంటి సోషల్ ఎలిమెంట్ తోనే సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది.ఇక ఈ సినిమా కోసం శర్వానంద్ తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తుంది. సార్ మూవీ రిలీజ్ తర్వాత శర్వానంద్ కి కథ చెప్పే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది.ఇక ఈ ప్రాజెక్ట్ కూడా సితార ఎంటర్టైన్మెంట్ లోనే తెరకెక్కే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తుంది. అయితే శర్వానంద్ ఇప్పటికే ఇలాంటి సోషల్ ఎక్స్పర్మెంట్ కాన్సెప్ట్ లు చేసి శ్రీకారం లాంటి సినిమాతో డిజాస్టర్ కొట్టాడు. అలాగే గతంలో కూడా కొన్ని ఫ్లాప్ లు చూసాడు. మరి వెంకి అట్లూరి చెప్పే కథకి ఎంత వరకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాడు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




## ఫర్జీ వెబ్ సిరీస్ ఎలా ఉందంటే?

రాజ్ అండ్ డీకే దర్శద్వయం అంటే ది ఫ్యామిలీ మెన్ వెబ్ సిరీస్ గుర్తుకొస్తుంది. ఆ సిరీస్ లో ఇప్పటి వరకు రెండు పార్ట్స్ ని వారు తెరకెక్కిస్తే ఆ రెండు బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకున్నాయి. సినిమాల కంటే వెబ్ సిరీస్ లతో మంచి సక్సెస్ ని అందుకోవడంతో పాటు భాగా గుర్తింపు పొందిన ఈ ఇద్దరు దర్శకులు అటు వైపు సినిమాలని తెరకెక్కిస్తూనే మరో వైపు వెబ్ సిరీస్ లు కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక సిటాడెల్ అనే వెబ్ సిరీస్ ని సమంతా వరుణ్ ధావన్ కాంబినేషన్ లో తెరకెక్కించడానికి సిద్ధం అవుతున్నారు.ఇదిలా ఉంటే తాజాగా వీరు ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. విజయ్ సేతుపతి షాహిద్ కపూర్ ఇందులో మెయిన్స్ లీడ్స్ లో నటించడంతో దీనికి మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ వెబ్ సిరీస్ కథలోకి వెళ్తే డీమోనిటైజేషన్ నేపథ్యంలో కథ నడుస్తుంది. నోట్ల రద్దు కారణం చిన్న చిన్న బొమ్మలు వేస్తూ లైఫ్ ని లీడ్ చేసే సన్నీ( షాహిద్ కపూర్) సంపాదన లేక అప్పులపాలవుతాడు. అదే సమయంలో తన తాతయ్య నడిపించే విప్లవ పత్రిక అప్పుల కారణంగా మూతబడుతుంది. దాంతో డబ్బు కోసం సన్నీ తన ఫ్రెండ్ తో కలిసి దొంగ నోట్ల ముద్రణ మొదలు పెడతాడు.ఇక ఈ విషయాన తెలుసుకున్న దొంగనోట్ల మాఫియాని నడిపే వ్యక్తితో కలుస్తాడు. అయితే దేశంలో దొంగ నోట్ల వ్యాపారం చేసే గ్యాంగ్ స్టార్స్ ని పట్టుకోవడం కోసం ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ అధికారిగా మైఖేల్ (విజయ్ సేతుపతి) ని నియమిస్తుంది. అతనికి అసిస్టెంట్ గా రాశిఖన్నా ఉంటుంది.




## సుడిగాలి సుధీర్ "గాలోడు" కి ఓటిటి డేట్ ఫిక్స్.!




మన తెలుగు స్మాల్ స్క్రీన్ దగ్గర సాలిడ్ క్రేజ్ ఉన్నటువంటి కమెడియన్స్ లో జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ కోసం చెప్పక్కర్లేదు. తాను అక్కడ నుంచి సిల్వర్ స్క్రీన్ పై హీరోగా ఎదిగి అక్కడ కూడా మంచి సక్సెస్ ని అందుకున్నాడు. అలాగే తాను చేసిన లేటెస్ట్ మాస్ చిత్రం "గాలోడు". దర్శకుడు పులిచర్ల రాజశేఖర్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం సుధీర్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. ఇక ఈ సినిమా అయితే ఇప్పుడు ఓటిటి లో స్ట్రీమ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది. మరి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు అయితే ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ ఆహా వారు సొంతం చేసుకోగా ఇందులో ఈ చిత్రం ఈ ఫిబ్రవరి 17 నుంచి అందుబాటులో ఉండనున్నట్టుగా అనౌన్స్ చేశారు. దీనితో ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న వారు ముఖ్యంగా సుధీర్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో గెహన సిప్పి హీరోయిన్ గా నటించగా భీమ్స్ సంగీతం అందించాడు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com